
తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త




2లో

# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

ప్రొఫెషనల్ పదజాలం, పరిభాష" పై విస్తరణ ఉపన్యాసం




3లో

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 49 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- ఆదివారం 15 ఫిబ్రవరి 2026




**తెలంగాణలో మారుతున్న సమీకరణాలు**

**కనీసం 20 కైవసం చేసుకునేలా కసరత్తు**

**మంత్రులు, పార్టీ నేతలతో సిఎం రేవంత్ సమీక్ష**

**ఆయారామ్ గయారామ్‌ల హడావిడి**

**సిఎం రేవంత్‌తో భేటీ అయిన వడ్డేపట్టి కౌన్సిలర్లు**



## హంగ్ మున్సిపాలిటీలపై


# కాంగ్రెస్ నజర్

**హైదరాబాద్,ఫిబ్రవరి 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** మున్సిపల్ ఎన్నికల ఫలితాల తరవాత సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. మరోవైపు ఛైర్మన్లు, వైఎస్ ఛైర్మన్ల ఎంన్నికపై అనుసరించాల్సిన వ్యూహంపై సిఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు. ప్రధానంగా రాష్ట్రంలో హంగ్ ఏర్పడిన మున్సిపాలిటీల్లో స్వతంత్ర అభ్యర్థులే కీలకంగా మారనున్నారు. మ్యాజిక్ ఫిగర్ దాటని మున్సిపాలిటీలను హస్తగతం చేసుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ కసరత్తు ముమ్మరం చేసింది. ఈ క్రమంలోనే జూబ్లీహిల్స్‌లోని సిఎం క్యాంపు కార్యాలయంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు.. తదుపరి కార్యాచరణపై చర్చించారని సమాచారం. మిగతా2లో...

## ఉన్నంతలో మెరుగైన బడ్జెట్

# అందించాం

**● ఆదాయం తక్కువ - ఖర్చులు ఎక్కువ ● అది వారసత్వంగా వస్తున్న ప్రక్రియ ● బడ్జెట్‌పై సిఎం చంద్రబాబు వ్యాఖ్యలు**



**అమరావతి,ఫిబ్రవరి 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రస్తుత పరిస్థితుల్లో మెరుగైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టామని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. రెండుమూడేళ్లలో మరింత మెరుగైన బడ్జెట్ ప్రవేశపెడతామన్నారు. వైకాపా విధ్వంసం నుంచి కోలుకోవడానికి ఇంకా సమయం పడుతుందని చెప్పారు. రాష్ట్ర బడ్జెట్‌పై ఆయన స్పందిస్తూ.. ఇబ్బందులు అధిగమించి ఇప్పుడిప్పుడే ట్రాక్ ఎక్కుతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో సమస్యలు ఇంకా చాలా ఉన్నాయని చెప్పారు. ఆదాయం తక్కువ - ఖర్చులు ఎక్కువ అనేది వారసత్వంగా వచ్చింది. కేంద్ర సహకారంతో మేనేజ్ చేసుకుంటూ వస్తున్నాం. వ్యవసాయం, సేవారంగాల నుంచి ఎక్కువ మిగతా2లో...


## దేశ భద్రతను కాంగ్రెస్ ప్రమాదంలో

# పడేస్తుంది

**ఈశాన్య ప్రాంతాన్ని అష్టలక్ష్మిగా పరిగణిస్తున్నాం!**

**అసోంకు కీలకం కానున్న రాబోయే ఐదేళ్లు**

**ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 14 (పిసిడబ్ల్యూ న్యూస్):**కాంగ్రెస్ ఎల్లప్పుడూ దేశ భద్రతను ప్రమాదంలో పడేస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. దేశాన్ని ముక్కలు చేయాలని కలలు కనేవారిని, ఈశాన్య ప్రాంతాన్ని భారత్ నుంచి వేరు మిగతా2లో...

## అమెరికా ఒప్పందంతో

# రైతులకు తీవ్ర నష్టం

**● వస్త్ర పరిశ్రమ, పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతారు ● ఒప్పందంపై భ్రమలు కల్పిస్తున్న ప్రధాని మోదీ ● కాంగ్రెస్ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ**



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** అమెరికాతో మోదీ సర్కార్ చేసుకున్న ఒప్పందం కారణంగా దేశంలో వస్త్ర పరిశ్రమ, పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి ఆరోపించారు. ప్రధాని, ఆయన కేబినెట్ మంత్రులు ప్రజల్లో భ్రమలు కల్పిస్తున్నారని ఆయన ఎక్స్‌లో దుయ్యబట్టారు. అమెరికా నుంచి పత్తిని దిగుమతి చేసుకుంటేనే, భారత వస్త్ర పరిశ్రమకు సుంకాల మినహాయింపు మిగతా2లో...

## కరీంనగర్ మేయర్ పీఠం

# బిజెపిదే

**కాంగ్రెస్, బిఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలను తిప్పికొడుతాం**

**ప్రజాతీర్పును కాలరాసేలా కుట్రలు**

**కేంద్రమంత్రి బండి సంజయ్**



**హైదరాబాద్,ఫిబ్రవరి 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** అధికార పార్టీ కాంగ్రెస్‌తో బీఆర్ఎస్, ఎంఐఎం అనైతిక పొత్తులు పెట్టుకొని భాజపాని మున్సిపల్ ఎన్నికల్లో ఓడించాలని చూసినా.. ప్రజలు మాత్రం తమని ఆశీర్వదించారని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన ఆయన.. అత్యధిక స్థానాలు చేజిక్కించుకున్న తామే కరీంనగర్ మేయర్ పీఠం పక్కా ప్లాన్‌తో వ్యూహాత్మకంగా దక్కించుకోబోతున్నామని స్పష్టం చేశారు. ప్రజల నిర్ణయానికి వ్యతిరేకంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ వ్యవహరిస్తే.. వారి మధ్య ఉన్న లోపాయికారి ఒప్పందం మిగతా2లో...



## మున్సిపల్ ఫలితాల ప్రభావం అసెంబ్లీపై ఉండదు

**ఇవి స్థానిక రాజకీయాల ఆధారంగా జరిగినవే**

**అయినా గణనీయంగా తమ బలాన్ని పెంచుకున్నాం**

**మీడియాతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్**

**హైదరాబాద్,ఫిబ్రవరి 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో ఇటీవల జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాల ప్రభావం రానున్న అసెంబ్లీ ఎన్నికలపై ఉండదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ ఫలితాల ప్రభావం అసెంబ్లీ ఎన్నికలపై ఉండదని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫలితాలే దీనికి స్పష్టమైన ఉదాహరణ అని ఆయన అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నుంచి పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గణనీయంగా మెరుగుపడిందని కేటీఆర్ తెలిపారు.

మిగతా2లో...

## రూ.1,60,504 కోట్ల విలువైన పనులకు

# కేబినేట్ ఆమోదం

**● అస్సాంలో అండర్ వాటర్ రివర్ టన్నెల్ నిర్మాణం**

**● ఢిల్లీ- అంబాల మధ్య మూడు, నాలుగో రైల్వే లైన్ ఏర్పాటు**



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన శనివారం జరగిన కేంద్ర సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ భేటీకి కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, అశ్విని వైష్ణవ్ తదితరులు హాజరయ్యారు. ప్రధానంగా ప్రధానమంత్రి కార్యాలయం పేరును 'సేవతీర్థ్'గా మార్చాలని నిర్ణయం తీసుకున్నారు. అలాగే రూ. 1,60,504 కోట్ల విలువైన పనులను చేపట్టాలని కేంద్ర సర్కార్ నిర్ణయించింది. అస్సాంలో అండర్ వాటర్ రివర్ టన్నెల్ నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రోహుపూర్ -నుమాలిఘర్ మధ్య అండర్ వాటర్ రోడ్డు టన్నెల్ ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదించింది. 34 కిలోమీటర్ల మేర అండర్ మిగతా2లో...

## ఎక్స్ అఫీషియో సభ్యులకు

# ఓటు హక్కు




**- రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టీకరణ**

**హైదరాబాద్,ఫిబ్రవరి 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** మున్సిపల్ పరోక్ష ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన జారీ చేసింది. మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ ఎన్నికల్లో ఎక్స్‌అఫీషియో సభ్యుల ఓటుహక్కుపై స్పష్టతనిచ్చింది. తెలంగాణ మున్సిపాలిటీస్ చట్టం-2019 ప్రకారం.. రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలు, ఇతర ఎక్స్‌అఫీషియో సభ్యులకు ఓటు హక్కు తప్పనిసరి అని తెలిపింది. మున్సిపల్ పరిధిలో ఓటరుగా నమోదు కానివారు ఓటు వేసేందుకు అనర్హులని సీఈసీ స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పు మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం కొత్త మార్గదర్శకాలు విడుదల చేసింది. మున్సిపల్ పరిధిలో ఓటరుగా నమోదు కాకుండా ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఓటువేసే వారిని అనర్హులుగా పరిగణిస్తారని, వారి ఓట్లు చెల్లవని న్యాయస్థానం తెలిపింది. మిగతా2లో...

# హంగ్ మున్సిపాలిటీలపై కాంగ్రెస్ నజర్

(మొదటి పేజీ తరువాయి)

ప్రధానంగా 38 హంగ్ మున్సిపాలిటీలపై చర్చ జరగనుంది. వీటిలో ఎక్కువ స్థానాలు కాంగ్రెస్ దక్కించుకునేలా మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేసినట్లుగా ప్రచారం సాగుతోంది. 20కిపైగా హంగ్ మున్సిపాలిటీలు 'హస్త'గతం అవుతాయని ఆ పార్టీ నాయకత్వం అంచనా వేస్తోంది. ఈ సమావేశానికి పలువురు సీనియర్ నేతలూ హాజరయ్యారు. ఇకపోతే తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం ఎన్నికల్లో గెలిచిన పలువురు స్వతంత్ర అభ్యర్థులు తమకు నచ్చిన పార్టీల్లో చేరుతున్నారు. ఇంద్రేశం మున్సిపాలిటీ 2వ వార్డు కౌన్సిలర్ లావణ్య, ఇస్నాపూర్ 10వ వార్డు కౌన్సిలర్ రాహుల్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. మరోవైపు నారాయణపేట పదో వార్డు స్వతంత్ర కౌన్సిలర్ జయశ్రీ భాజపాలో చేరారు. హైదరాబాద్‌లో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు సమక్షంలో కాషాయం కండువా కప్పుకొన్నారు. నారాయణపేటలో మొత్తం 24 స్థానాలకు భాజపా 11 స్థానాలు గెలుచుకుంది. స్వతంత్ర అభ్యర్థి చేరికతో భాజపా సభ్యుల సంఖ్య 12కి చేరింది. దీంతో నారాయణపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నికలో ఎక్స్ అఫిషియో ఓటు కీలకం కానుంది.

ఇప్పటికే బెల్లంపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు, భాజపాకు చెందిన ఒక కౌన్సిలర్ కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అక్కడ మొత్తం 34 స్థానాలు ఉండగా.. కాంగ్రెస్‌కు 14, బీఆర్ఎస్‌కు 14, స్వతంత్రులకు 5, భాజపాకు 1 స్థానం దక్కాయి. దీంతో ఆ పార్టీ బలం 17కు చేరింది. ఈ నెల 16న ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నారు. మరోవైపు జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఫార్వర్డ్ బ్లాక్‌కు చెందిన 8 మంది కౌన్సిలర్లు హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వడ్డేపల్లి శ్రీనివాస్ నేతృత్వంలో కౌన్సిలర్లు కుర్వ పావని, శారద, మంజుల, యుగేందర్‌రెడ్డి, దేవమ్మ, విజయ్‌భాస్కర్, జయశ్రీ, తిమ్మప్ప నగరానికి చేరుకొని సీఎంతో భేటీ అయ్యారు. మీడియాతో కౌన్సిలర్లు మాట్లాడుతూ.. తాము కాంగ్రెస్ పార్టీలో చేరట్లేదని స్పష్టం చేశారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసమే సీఎంను కలిసినట్లు చెప్పారు. తెలంగాణ జాగృతి పార్వర్డ్ బ్లాక్ ద్వారా పోటీ చేసింది. అయితే అభివృద్ధికి సహకరిస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

# దేశ భద్రతను కాంగ్రెస్ ప్రమాదంలో పడేస్తుంది

(మొదటి పేజీ తరువాయి)

చేయాలని నినాదాలు చేసేవారిని హస్తం పార్టీ సమర్థిస్తుందని విమర్శించారు. దేశాన్ని విభజించాలనుకునేవారే కాంగ్రెస్ ఆరాధకులుగా మారుతారని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ముస్లిం లీగ్ దేశాన్ని విభజించిందని, ఇప్పుడు నేటి కాంగ్రెస్ 'ముస్లిం లీగ్ మావోయిస్టు కాంగ్రెస్'గా మారిందని దుయ్యబట్టారు. అందుకే కాంగ్రెస్ పట్ల అసోం ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అసోంలోని గువాహటిలో జరిగిన ర్యాలీలో ఈ మేరకు మోదీ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అసోం ఆకలితో అలమటించిందని ప్రధాని మోదీ ఆరోపించారు. అలాగే భయం గుప్పిట్లో ఉందన్నారు. అభివృద్ధి కోసం నిధులు ఇవ్వకుండా తప్పించుకునే హస్తం పార్టీ అసోంను అభివృద్ధి చేయగలదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో కేంద్రం నుంచి అసోం పన్ను వాటాగా రూ.10,000 కోట్లు మాత్రమే అందుకునేదన్నారు. ఇప్పుడు బీజేపీ సర్కార్ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కన్నా 5 రెట్లు ఎక్కువను పన్ను వాటాగా అందుకుంటోందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ విస్మరించిన ఈశాన్య ప్రాంతాలకు తాము భక్తితో సేవ చేస్తున్నామని పేర్కొన్నారు.కాంగ్రెస్ అసంతృప్తికి అతిపెద్ద కారణం ఓటు బ్యాంకు రాజకీయాలే. హస్తం పార్టీ ఎప్పుడూ అసోంను ఎన్నికల కోణంలోనే చూసింది. ఆ పార్టీ హయాంలో కేంద్ర ప్రభుత్వ పథకాలు అసోంకు చేరడానికి సంవత్సరాల కాలం పట్టింది. కానీ బీజేపీ ఎల్లప్పుడూ అసోం, ఈశాన్య ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూనే ఉంది. కొంతకాలం క్రితం దేశంలో మొట్టమొదటి స్లీపర్ వందే భారత్ రైలు అసోం నుంచే ప్రారంభమైంది. సెమీకండక్టర్ రంగంలో అసోం వృద్ధి ఇంజిన్‌గా మారుతోంది. ఇక్కడ తయారయ్యే చిప్‌ల గురించి అసోం టీ లాగా ప్రపంచవ్యాప్తంగా చర్చించుకునే రోజు ఎంతో దూరంలో లేదు. ఆ రాష్ట్ర వృద్ధి ప్రయాణాన్ని చాయ్ నుంచి చిప్స్ వరకు చూడవచ్చని అన్నారు. కాంగ్రెస్ హయాంలో 3జీ, 4జీ టెక్నాలజీ వచ్చిందని, అలాగే 2+ స్కామ్ కూడా వచ్చిందని మోదీ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ దశాబ్దాల పాలనలో ఎయిమ్స్‌ల గురించి పట్టించుకోలేదన్నారు. కనెక్టివిటీ పెరిగే కొద్దీ ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. ఇటీవల గువాహటిలో పరీక్ష పే చర్చ కార్యక్రమం జరిగింది. బ్రహ్మపుత్ర నదిపై క్రూయిజ్‌లో విద్యార్థులతో నేను చర్చించాను. రాబోయే ఐదేళ్లు అసోంకు చాలా కీలకం." అని మోదీ పేర్కొన్నారు. అసోం అభివృద్ధిలో, ప్రజల జీవితాల్లో బ్రహ్మపుత్ర నదిది ప్రముఖ పాత్ర అని మోదీ పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ 70 ఏళ్ల పాలనలో బ్రహ్మపుత్ర నదిని దాటడం ఎల్లప్పుడూ పెద్ద సవాలుగా ఉండదేదని ఆరోపించారు. దాదాపు 7 దశాబ్దాల పాలనలో ఆ పార్టీ బ్రహ్మపుత్ర నదిపై కేవలం 3 వంతెనలను మాత్రమే నిర్మించాయన్నారు. గత 10-11 ఏళ్లలో బీజేపీ సర్కార్ బ్రహ్మపుత్ర నదిపై ఐదు పెద్ద వంతెనలను పూర్తి చేసిందని తెలిపారు. కాంగ్రెస్ అసోంకు సమస్యలను మాత్రమే ఇచ్చిందని, బీజేపీ మాత్రం వాటికి పరిష్కారాలను చూపిందన్నారు.

# అమెరికా ఒప్పందంతో రైతులకు తీవ్ర నష్టం

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుందనే విషయాన్ని ఎందుకు దాచారని ఆయన ప్రశ్నించారు. బంగ్లాదేశ్ కూడా భారత్ నుంచి పత్తి దిగుమతులను నిలిపివేసే సంకేతాలు ఇస్తోందని, తద్వారా రైతులకు నష్టం జరుగుతుందని రాహుల్ గాంధీ ఆరోపించారు. దూరదృష్టి గల ప్రభుత్వం అయితే పత్తి రైతులు, టెక్స్‌టైల్ ఎగుమతిదారుల ప్రయోజనాలను కాపాడేలా ఒప్పందం చేసుకునేదని రాహుల్ అన్నారు.భారత్‌లోని టెక్స్‌టైల్ రంగం 5 కోట్ల కుటుంబాలకు ఉపాధినిస్తోంది. నరేంద్ర మోదీ అమెరికాతో చేసుకున్న ఒప్పందం భారత టెక్స్‌టైల్ రంగాన్ని అంతం చేస్తుంది. ఈ విషయం నరేంద్ర మోదీకి, మొత్తం భారతదేశానికి తెలుసు. అదే నేను పార్లమెంటులో చెప్పాను. బంగ్లాదేశ్‌కు 0% పన్ను, భారత్‌కు 18% పన్ను విధిస్తున్నారు. అందువల్ల భారత టెక్స్‌టైల్ పరిశ్రమను బంగ్లాదేశ్ టెక్స్‌టైల్ పరిశ్రమ దెబ్బతీస్తుంది. మనకు కూడా ఆ రాయితీ కావాలంటే అమెరికా నుంచి పత్తిని దిగుమతి చేసుకోవాలని కేంద్రమంత్రి ఒకరు చెప్పారు. కానీ అసలు నిజం ఏమిటంటే మన పత్తి బంగ్లాదేశ్‌కు వెళ్తుంది. మన పత్తి ద్వారానే భారత్‌లో టెక్స్‌టైల్ మిల్లులు నడుస్తున్నాయి. ఒకవేళ మనం బంగ్లాదేశ్ లాగా అమెరికా పత్తిపై ఆధారపడితే మన దేశంలో పత్తి రైతులు, వస్త్ర పరిశ్రమ నాశనమైపోతాయి. ఒకవేళ మనం అమెరికా పత్తిని దిగుమతి చేసుకోకపోతే మన టెక్స్‌టైల్ పరిశ్రమ దెబ్బతింటుంది. ఇదే అసలు నిజం. పీయూష్ గోయల్ అబద్ధాలు చెప్పవద్దు. అందుకే 'సరెండర్' అంటున్నాను. ఎందుకంటే ఈ ఒప్పందం వల్ల పత్తి రైతు నష్టపోతాడని అన్నారు. ఒకవేళ మోదీ ప్రభుత్వం జాతీయ ప్రయోజనాల కోసం ఆలోచించి ఉంటే పత్తి రైతులు, వస్త్ర ఎగుమతిదారుల శ్రేయస్సును రక్షించే విధంగా చర్చలు జరిపి ఉండేదని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. మోదీ, ఆయన ప్రభుత్వం కలిసి రెండు రంగాలకు తీవ్ర నష్టం కలిగించే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. ఈ ఒప్పందం కారణంగా పత్తి, వస్త్ర పరిశ్రమ రంగాలపై ఆధారపడి ఉన్న కోట్లాది మంది భారతీయుల కుటుంబాలను నిరుద్యోగం, ఆర్థిక సంక్షోభం అనే గొయ్యిలోకి నెట్టివేశారని రాహుల్ గాంధీ విమర్శించారు.

# తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త

## గూడె బేల్లూరు - మహబూబ్‌నగర్ నాలుగు లైన్ల రోడ్డు

## 3,175 కోట్ల ఖర్చుతో నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగానే కర్ణాటకలోని గూడె బేల్లూరు-తెలంగాణలోని మహబూబ్‌నగర్ సెక్షన్ మధ్య రూ. 3,175 కోట్ల ఖర్చుతో నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. జాతీర రహదారి 167 కింద సుమారు 80 కి.మీ మేర ఈ రోడ్డు నిర్మాణం కానుంది. రాయచూర్, నారాయణపేట, దేవరకద్ర, మహబూబ్ నగర్ మీదుగా హైదరాబాద్‌కు ఉన్న ఈ కనెక్టివిటీకి ఈ కొత్త నాలుగు లైన్‌ల హైవేను అటాచ్ చేస్తూ నిర్మాణం చేపట్టనున్నారు.దీంతో పాటు హైదరాబాదు పనాజీ కారిడార్‌లో భాగంగా కొత్త నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు సైతం కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దమాసియా బిటాడ నర్సాపూర్మలోత సెక్షన్ మధ్య నాలుగు లైన్ల నిర్మాణానికి 4,584 కోట్ల రూపాయలను ఖర్చు పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అలాగే గోతి- ట్రిమ్బక్ -- పాల్గర్ సెక్షన్ అబ్రిడేషన్ కోసం 3320 కోట్ల రూపాయలు కేంద్రం ఖర్చు చేయనుంది. అలాగే రూ. 2,254 కోట్లతో నోయిడా మెట్రో ఆక్వా లైన్ 11.6 కిమి పొడిగింపుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. నోయిడా బొటానికల్ గార్డెన్ నుంచి నోయిడా సెక్టార్ 142 వరకు మెట్రో లైన్ పొడిగింపునకు నిర్ణయం తీసుకుంది. నాలుగేళ్లలో ఈ



ప్రాజెక్టు పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యం పెట్టుకుంది. అలాగే రూ. లక్ష కోట్లతో అర్బన్ చాలెంజ్ ఫండ్ కి కేబినెట్ ఆమోదం తెలిపింది. పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు రాష్ట్రాలకు రుణసాయం చేయాలని నిర్ణయించింది. స్టార్టప్ ఇండియా ఫండ్ 2.0 కి 10 వేల కోట్ల కేటాయింపునకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.మూడోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత 13.3 లక్షల కోట్ల ప్రాజెక్టులకు కేంద్ర ఆమోదం తెలిపింది. 2024 లో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూ. 1,89,601 కోట్లతో 49 రైల్వే ప్రాజెక్టులకు , రూ. 2,48,053 కోట్లతో 24 జాతీయ రహదారుల ప్రాజెక్టులును కేంద్రం చేపట్టింది. అలాగే రూ. 1,15,406 కోట్లతో 9 మెట్రో ప్రాజెక్టులు, రూ. 7,339 కోట్లతో నాలుగు నూతన ఎయిర్పోర్టుల నిర్మాణానికి కేంద్రం నిర్ణయం తీసుకుంది.రూ. 1,45,945 కోట్లతో పోర్టు నిర్మాణానికి, రూ. 6,811 కోట్లతో రెండు రోప్ వే ప్రాజెక్టుల నిర్మాణాన్ని కేంద్రం చేపట్టింది. అలాగే 3 హైడ్రో ప్రాజెక్టులకు గాను బడ్జెట్‌లో రూ. 28,432 కోట్ల నిధులను కేటాయించింది. అంతేకాకుండా రూ. 28,602 కోట్లతో 12 ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలకు అమోదం తెలిపింది. పీఎం ఆవాస్ యోజనకు కింద రూ. 5,36,137 కోట్లు కేటాయింపు చేసింది.

# ఉన్నంతలో మెరుగైన బడ్జెట్ అందించాం

(మొదటి పేజీ తరువాయి)

ఆదాయం రావాలి. రెండుమూడేళ్లలో అమరావతికి ఒక రూపు వస్తుంది. అక్కడి రోడ్లను జాతీయ రహదారికి అనుసంధానిస్తున్నాం. అమరావతికి రాకపోకలు పెరిగి ఆదాయమూ వస్తుంది. అమరావతికి పశ్చిమ బైపాస్‌తో యాక్సెస్ పెరిగింది. ఇన్నర్, ఔటర్ రింగురోడ్డుతో మరింత పెరుగుతుంది. హార్టికల్చర్ హబ్‌కు రూ.30వేల కోట్లు కేటాయించడం బాగుంది. రాయలసీమలో ఒకప్పుడు పశువులకు నీరు కూడా దొరికేది కాదు. 2014-19 మధ్య కూడా రెయిన్ గన్స్‌తో పంటలు కాపాడే పరిస్థితి ఉండేది. అప్పుడే హంద్రీనీవాను సీరియస్‌గా తీసుకున్నాం. రాయలసీమ ముఖచిత్రం మార్చింది మేమే. దేశంలోనే నాణ్యమైన పండ్లు రాయలసీమ నుంచి వస్తున్నాయి. ఇక్కడ పండే దానిమ్మకు మంచి డిమాండ్ ఉంది. ఎమ్మెల్యేలకు సీల్డ్ కవర్‌లో ఇచ్చే నివేదిక వారి పనితీరుకు నిలువుటద్దం. నేను గతంలో ఉన్నట్లు నిక్కచ్చిగానే ఉంటా. మారకపోతే వాళ్లకే నష్టం. మొత్తం 9 పారామీటర్లలో సర్వే చేయించి వారికి నివేదిక ఇస్తున్నా. వారికి తెలియని ఇంకొన్ని పారామీటర్లు కూడా నా వద్ద ఉన్నాయి. లోకేశ్ తన పని తాను చేస్తున్నాడు. నా పని నేను చేస్తున్నా. నేతలతో మానవీయ సంబంధం, మోటివేషన్.. భయం-భక్తిలా ఉండాలి. మంగళగిరి చీరలకు లోకేశ్ బాగా బ్రాండింగ్ కల్పిస్తున్నారని చంద్రబాబు తెలిపారు.

# రూ.1,60,504 కోట్ల విలువైన పనులకు కేబినేట్ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

వాటర్ టన్నెల్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. ఈ టన్నెల్ నిర్మాణంతో 250 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. ఈ టన్నెల్ నిర్మాణం ద్వారా 6 గంటల సమయం పట్టే గమ్యస్థానాన్ని కేవలం 20 నిమిషాల్లోనే చేరుకునే అవకాశం ఉంది. బ్రహ్మపుత్ర నది కింద రైల్వేలైన్, నేషనల్ హైవే కోసం టన్నెల్‌ని నిర్మించనుంది. అలాగే కసారా-మన్మాడ్ మూడు, నాలుగో రైల్వేలైన్ ప్రాజెక్ట్‌కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఢిల్లీ- అంబాల మధ్య మూడు, నాలుగో రైల్వే లైన్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. బళ్లారి-హోస్పేట మధ్య రూ.2,372 కోట్లతో 3, 4 రైల్వేలైన్ల ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదించింది. గూడె బేల్లూరు నుంచి మహబూబ్‌నగర్ సెక్షన్ మధ్య రూ.3,175 కోట్ల ఖర్చుతో నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణానికి ఆమోదం తెలిపింది. మహబూబ్‌నగర్, నారాయణపేట, రాయచూర్, దేవరకద్ర, హైదరాబాద్‌కు ఈ కనెక్టివిటీ ఉంది. హైదరాబాద్-పనాజీ కారిడార్‌లో భాగంగా కొత్త నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం చేపట్టనుంది. 80 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.3175 కోట్ల ఖర్చు చేయనుంది. దమాసియా- బిటాడ నర్సాపూర్ మలోత సెక్షన్ మధ్య నాలుగు లైన్ల నిర్మాణానికి రూ.4,584 కోట్లను ఖర్చు చేయనుంది. గోతి- ట్రిమ్బక్ - పాల్గర్ సెక్షన్ అబ్రిడేషన్ కోసం రూ.3320 కోట్లని కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేయనుంది.

# కరీంనగర్ మేయర్ పీఠం బిజెపిదే

(మొదటి పేజీ తరువాయి)

బయట పెడతానని తేల్చి చెప్పారు. ప్రతి ఎన్నికల్లోనూ కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు అనుసంధానకర్తగా ఎంఐఎం పనిచేస్తుందని ఆరోపించారు. కరీంనగర్‌లో కార్యకర్తల కష్టం, ప్రధాని మోదీ ఆశీస్సులతో గెలవడం సంతోషంగా ఉందని కేంద్రమంత్రి హర్షం వ్యక్తం చేశారు. స్వతంత్ర అభ్యర్థులు భాజపాలో చేరారని, మేయర్ పీఠానికి అవసరమైన మ్యాజిక్ ఫిగర్ దాటేశామని వెల్లడించారు. మున్సిపల్ పీఠం ఎన్నికలో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎంతో పొత్తు ఉండదని స్పష్టం చేశారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ అభివృద్ధి కోసం ఇప్పటివరకూ రూ.1,400 కోట్ల పనులు చేశామని తెలిపారు. ఎన్నికల్లో భాజపా అభ్యర్థులను గెలిపించినందుకు కరీంనగర్ ప్రజలకు బండి కృతజ్ఞతలు చెప్పారు. ఎంఐఎం రివైవల్ డే నిర్వహించడంపై కేంద్రమంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. దేనికోసం రివైవల్ డే చేస్తున్నారని ప్రశ్నించారు. రజాకర్ల రాజ్యం తెస్తారా.. మహిళలను కించపరిచి బతుకమ్మ ఆడిస్తారా.. పాత రాజ్యం తెస్తామని ఎంఐఎం రివైవల్ డే చేస్తుందా అని నిలదీశారు.

వారి ఆటలు సాగనివ్వమని స్పష్టం చేశారు. ఎంఐఎం ప్రాబల్యం ప్రతి ఎన్నికల్లో తగ్గుతుందని, భాజపా బలపడుతూ వస్తోందని చెప్పారు. రాష్ట్రంలో భాజపా జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేశారు. భాజపా అభ్యర్థుల విజయం పట్ల రాష్ట్ర పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన మిఠాయిలు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు.

# మున్సిపల్ ఫలితాల ప్రభావం అసెంబ్లీపై ఉండదు

(మొదటి పేజీ తరువాయి)

శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఎక్స్అఫీషియో ఓట్ల నమోదు విషయంలో సీఎస్, రాష్ట్ర ఎన్నికల సంఘంతో మాట్లాడినట్లు ఆయన తెలిపారు. బీఆర్ఎస్ 30 మున్సిపాలిటీలకు పైగా సులువుగా గెలుచుకుంటుందని అనుకున్నప్పటికీ, కొంత తగ్గిందని కేటీఆర్ అన్నారు. హంగ్ వచ్చిన ప్రాంతాల్లో కూడా పరిస్థితి తమకు అనుకూలంగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి కూడా ఆశించిన మేర మున్సిపాలిటీలు రాలేదని ఆయన పేర్కొన్నారు. కరీంనగర్, నిజామాబాద్ ప్రాంతాల్లో మినహాయించి బీజేపీ ప్రభావం ఎక్కడా అంతగా లేదని కేటీఆర్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు కాబట్టి అక్కడి పరిస్థితులను బట్టే పొత్తులు ఉంటాయని తెలిపారు. ఫార్ములా కేసులో ఏమీ లేదని ఏసీబీ అధికారులే చెబుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. ఫార్ములా-ఈ, ఫోన్ ట్యాపింగ్ కేసులో ఐదుసార్లు విచారణకు పిలిచారని, మళ్లీ పిలిస్తే వెళ్తానని చెప్పారు. ప్రభుత్వం అరెస్టు చేయాలనుకుంటే అరెస్ట్ అవుతానని ఆయన వ్యాఖ్యానించారు. సింగరేణి కార్మికులకు స్పష్టమైన సందేశం ఇవ్వాలనే ఆలోచనతోనే కొత్తగూడెంలో సీపీఐకి మద్దతు ఇస్తామని చెప్పినట్లు కేటీఆర్ వెల్లడించారు.

# ఎక్స్ అఫీషియో సభ్యులకు ఓటు హక్కు

(మొదటి పేజీ తరువాయి)

కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులకు సీఈసీ సర్క్యులర్ జారీ చేసింది. నిబంధనలను పక్కాగా అమలు చేయాలని ఆదేశించింది. దీంతో స్థానిక ఓటు హక్కు ఉంటేనే ఎంపీలు, ఎమ్మెల్సీలు.. మేయర్/ఛైర్ పర్సన్ పదవుల ఎన్నికల్లో ఓటువేసి ఫలితాలను ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది.

# ఫార్ములా-ఈ కార్ రేసులో కీలక పరిణామం

- ఐఎఎస్ అధికారి అరవింద్ కుమార్ విచారణకు అనుమతి



**హైదరాబాద్,ఫిబ్రవరి 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఫార్ములా-ఈ కార్ రేసు కేసు కీలక మలుపు తిరిగింది. సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌ను ప్రాసిక్యూషన్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారికంగా అనుమతి లభించింది. ప్రాసిక్యూషన్ విషయంపై రాష్ట్రానికి కేంద్రం సమాచారం ఇచ్చింది. ఫార్ములా-ఈ రేసింగ్ ఒప్పందాల్లో నిబంధనల ఉల్లంఘన జరిగిందని తెలంగాణ అవినీతి నిరోధక శాఖ గతంలోనే కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్ ని విచారించడానికి తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. తాజాగా అరవింద్ కుమార్ విషయంలో కేంద్రం అనుమతి ఇవ్వడంతో.. ఇప్పుడు ఏసీబీ ఆయనపై కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేసేందుకు పూర్తి స్వేచ్ఛ పొందింది. కాగా, ఈ కేసులో ఏ1గా మాజీ మంత్రి కేటీఆర్, ఏ2గా ఐఏఎస్ అధికారి అరవింద్ ఉన్నారు.

# ప్రొఫెషనల్ పదజాలం, పరిభాష“ పై విస్తరణ ఉపన్యాసం

### కాకతీయ ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి), హనుమకొండ, ఆంగ్ల విభాగం నిర్వహించింది





**హనుమకొండ: ఫిబ్రవరి 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాకతీయ ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి), హనుమకొండలోని ఆంగ్ల విభాగం, ఈరోజు వర్చువల్ రూమ్‌లో తన విద్యార్థుల ప్రయోజనం కోసం “ప్రొఫెషనల్ పదజాలం మరియు పరిభాష“ పై విస్తరణ ఉపన్యాసాన్ని విజయవంతంగా నిర్వహించింది. విభిన్న వృత్తిపరమైన వాతావరణాలలో కెరీర్ సంసిద్ధతకు అవసరమైన అవసరమైన వృత్తిపరమైన భాషా నైపుణ్యాలు, ప్రత్యేక పరిభాష మరియు ప్రభావవంతమైన కమ్యూనికేషన్ సాధనాలతో విద్యార్థులను సన్నద్ధం చేయడం ఈ కార్యక్రమం లక్ష్యం. విశ్వవిద్య మరియు వ్యాపార నిర్వహణ విభాగం వైస్ ప్రిన్సిపాల్ మరియు అధిపతి డాక్టర్ డి. రాజేశేఖర్, గౌరవనీయులైన రిసోర్స్ పర్సన్, గీతాంజలి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, హైదరాబాద్, ఇంగ్లీష్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సి. గోవర్ధన్ కు హృదయపూర్వక స్వాగతం పలికారు. విద్యార్థి సమాజానికి ఎంతో ప్రయోజనం చేకూర్చే ఇటువంటి విలువైన మరియు అంతర్దృష్టిగల కార్యక్రమాలను ప్రారంభించినందుకు ఆంగ్ల విభాగాన్ని ఆయన అభినందించారు. ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ ఎ. శ్రీనాథ్, ఆహ్వానాన్ని ఉదారంగా స్వీకరించి ఉపన్యాసం ఇచ్చినందుకు డాక్టర్ గోవర్ధన్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు ఈ సెషన్‌లో చురుకుగా పాల్గొనాలని మరియు వారి కమ్యూనికేషన్ సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి రిసోర్స్ పర్సన్ అందించిన ఆచరణాత్మక ఇన్‌పుట్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇంగ్లీష్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి. దినకర్, డాక్టర్ సి. గోవర్ధన్ యొక్క వివరణాత్మక ప్రొఫైల్‌ను ప్రరివీవితం చేశారు మరియు మెరుగైన విద్యా మరియు వృత్తిపరమైన అవకాశాల కోసం వారి ఇంగ్లీష్ కమ్యూనికేషన్ నైపుణ్యాలను సుసంపన్నం చేసుకోవడంపై దృష్టి పెట్టడానికి విద్యార్థులను ప్రేరేపించారు. ఉపన్యాసం చాలా ఇంటరాక్టివ్‌గా ఉంది, విద్యార్థుల నుండి ఉత్సాహభరితమైన భాగస్వామ్యంతో, వారు ప్రొఫెషనల్ పదజాలం, పరిశ్రమ-నిర్దిష్ట పరిభాష మరియు వాస్తవ-ప్రపంచ సందర్భాలలో వాటి అనువర్తనంపై విలువైన అంతర్దృష్టులను పొందారు. విడుదల సెషన్‌లో, ఇంగ్లీష్ విభాగం డాక్టర్ సి. గోవర్ధన్‌ను అతని అద్భుతమైన మరియు ఆకర్షణీయమైన ప్రదర్శనకు గుర్తింపుగా సత్కరించింది. ఇంగ్లీష్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్. రమేష్ చంద్ర శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు, రిసోర్స్ పర్సన్ తన సమాచార సెషన్‌కు మరియు అధ్యాపక సభ్యులు డాక్టర్ బి. శ్రీనివాస్, డాక్టర్ జి. రాజేష్ మరియు విద్యార్థుల చురుకైన భాగస్వామ్యం మరియు ఉత్సాహం కోసం కృతజ్ఞతలు తెలిపారు. మంచి స్పందన లభించింది మరియు పాల్గొనేవారి మొత్తం వ్యక్తిత్వం మరియు నైపుణ్య అభివృద్ధికి గణనీయంగా దోహదపడింది.

## ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలం
# జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం



### మూడో బ్రిడ్జి వద్ద ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొన్న లారీ ఐదుగురికి గాయాలు





**ములుగు జిల్లా ,ఫిబ్రవరి 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలం పరిధిలోని జాతీయ రహదారిపై హైవే మూడో బ్రిడ్జి వద్ద శనివారం రాత్రి తీవ్ర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మిర్చి బస్తాలు లోడ్ చేసుకుని కల్లం కాడికి (తన ఇంటి సమీపానికి) వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి వచ్చిన లారీ (నంబర్: TG 05 U 3546) ఢీకొనడంతో, ట్రాక్టర్ ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డుపై బోల్తా పడింది. ట్రాక్టర్‌లో ఐదుగురు కూలీలు ఈ ప్రమాద సమయంలో ట్రాక్టర్‌పై అంకన్ వెంకటేశు, బొల్లె రాములు, రెడ్డి గోపాలు రెడ్డి, శీను, కోనూరు సాంబశివరావు అనే ఐదుగురు కూలీలు ఉండగా, ఢీకొన్న దెబ్బకు మిర్చి బస్తాలు, కూలీలు ఒక్కసారిగా కింద పడిపోయారు. గాయాల వివరాలు:ముగ్గురికి స్వల్ప గాయాలుఇద్దరికి తీవ్ర గాయాలుకరికి చెయ్యి, కాలు విరగడంమరొకరికి తలకు తీవ్రమైన గాయంతీవ్రంగా గాయపడిన ఇద్దరిని ములుగు జిల్లా ఆసుపత్రికి తరలించగా,మిగిలిన ముగ్గురికి ఏటూరు నాగారం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ మరియు ఓనర్ పూజారి బుచ్చయ్యకు స్వల్ప గాయాలు కాగా, ఇది తూటాలో తప్పిన అతిపెద్ద ప్రమాదంగా స్థానికులు పేర్కొన్నారు. లారీ డ్రైవర్ మద్యం సేవించి వాహనం నడిపాడా ఈ ప్రమాదానికి కారణం లారీ డ్రైవర్ మద్యం సేవించి వాహనం నడపడం అని ప్రత్యక్ష సాక్షులు ఆరోపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రమాదంతో కొంతసేపు హైవేపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.


## రాజ్యాధికారం కోసం మాదిగలు సంఘటితం
# కావాలి: మోత్కుపల్లి నర్సింహులు







**కరీంనగర్ టౌన్ ఫిబ్రవరి 14(పిసిడబ్ల్యూ న్యూస్):** రాజ్యాధికారం సాధించాలంటే మాదిగలు చైతన్యవంతులై సంఘటిత శక్తిగా ఎదగాలని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు పిలుపునిచ్చారు. శనివారం కరీంనగర్ నగరంలోని ప్రతిమ హోటల్ కాన్ఫరెన్స్ హాల్లో మాదిగ మేధావుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెపల్లి రాజేందర్ అధ్యక్షతన నిర్వహించిన మాదిగ మహాశక్తి ఆత్మీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలను అసదుద్దీన్ ఒవైసీ నాయకత్వంలోని ఎంఐఎం పార్టీ ప్రభావితం చేస్తున్నదని పేర్కొన్నారు. అదే విధంగా 12 శాతం జనాభా కలిగిన మాదిగలు కూడా ఐక్యంగా ఉంటే ప్రభుత్వాలను, రాజకీయ పార్టీలను ప్రభావితం చేసే స్థాయికి ఎదగవచ్చన్నారు. మాదిగల ఐక్యత ద్వారానే ఇది సాధ్యమవుతుందని, ఆ లక్ష్యంతోనే మహాశక్తి ఆత్మీయ సభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ఉన్న ఎస్సీలు గంపగుత్తగా ఓటు వేయగలిగే స్థితికి రావాలని, మాదిగ దండోరా ఉద్యమంలో అమరులైన వారి త్యాగాలు మరువలేనివని అన్నారు. అమరుల కుటుంబాలకు స్మారక స్థూపం, రూ.కోటి ఆర్థిక సహాయం, ఇంటికో ఉద్యోగం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరినట్లు తెలిపారు. అధికారం లేకపోవడమే మాదిగల వెనుకబాటుకు ప్రధాన కారణమని ఆవేదన వ్యక్తం చేశారు. **అసైన్డ్ భూములకు పట్టాలివ్వాలి: డాక్టర్ కవ్వంపల్లి టీపీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు,** మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన అసైన్డ్ భూములకు పూర్తి హక్కులు కల్పిస్తూ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూతపడిన లెదర్ పార్కులను పునరుద్ధరించి, కొత్త లెదర్ పార్కులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. లీజుకు ఇచ్చిన భూముల లీజులను రద్దు చేసి ప్రభుత్వ ఆధ్వర్యంలోనే పార్కులు నిర్వహించాలని సూచించారు. **మాదిగలు ఏకతాటిపైకి రావాలి: పసునూరి దయాకర్** వరంగల్ మాజీ ఎంపీ పసునూరి దయాకర్ మాట్లాడుతూ మాదిగలను ఏకతాటిపైకి తీసుకువచ్చి, తమ ఓట్లను తమ జాతి అభ్యర్థులకు వేయడం ద్వారా రాజ్యాధికారాన్ని సాధించడమే ఈ సదస్సుల ముఖ్య ఉద్దేశమన్నారు. మాదిగలను ఒక రాజకీయ శక్తిగా తీర్చిదిద్దేందుకు ఈ ఉద్యమం దోహదపడుతుందని తెలిపారు. ఈ సదస్సులో ప్రొఫెసర్ కనుకయ్య, ఎం. విజయ్ కుమార్, గజ్జెల స్వామి, పల్లెల వీరస్వామి, డాక్టర్ కె. శ్రీనివాస్, బొంకూరు శంకర్, ఎం. దేవేందర్, బండా శ్రీనివాస్ తదితర మేధావులు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, మాదిగ సంఘాల నాయకులు పాల్గొన్నారు

## ములుగు జిల్లా ములుగు నూతన మున్సిపాలిటి
# వార్డ్ కౌన్సిలర్‌గా 26 ఏళ్ల యువకుడు



**ములుగు జిల్లా,ఫిబ్రవరి14 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు నూతన మున్సిపాలిటీలో 26 ఏండ్ల యువకుడు వార్డ్ కౌన్సిలర్ గా గెలుపొందారు. ములుగు జిల్లా బండారుపల్లి గ్రామానికి చెందిన కేశెట్టి రఘు పటేల్ గారి చిన్న కుమారుడు కేశెట్టి నవీన్, చిన్నతనం నుండి సేవా కార్యక్రమాలు తన తండ్రి గారితో కలిసి చురుకుగా పాల్గొనేవారు. కేశెట్టి నవీన్ గారు 13 సంవత్సరముల నుండి గ్రామంలోని అనేక ఉత్సవ కార్యక్రమాలు మరియు యువత కి ఆదర్శంగా చిన్నతనం నుండే అనేక కార్యక్రమాలు బండారుపల్లి ఊరి కోసం నిర్వహించారు పరిపాలన చేయాలంటే ప్రభుత్వాన్నితో చేయిగలిపి ఊరు బాగు చేయాలనే ఉద్దేశంతో మొట్టమొదటిసారిగా ములుగు మున్సిపాలిటీ ఏర్పడడంతో బండారుపల్లి ఊరు నుండి 11వ వార్డు కౌన్సిలర్ గా కాంగ్రెస్ అభ్యర్థిగా నిలబడి గెలుపొందడం జరిగినది. ఇంకా ఊరి కోసం తన విద్యతో తనకున్న పరిజ్ఞానంతో గ్రామం కోసం అనేక సమస్యలను తీర్చడానికి నేను రాజకీయమనే దారిలో రావాల్సి వచ్చిందని కేశెట్టి నవీన్ గారు ఒక ప్రకటనలో తెలియజేశారు. ములుగు మున్సిపాలిటీలో పెద్ద అవకాశం లభిస్తే మున్సిపాలిటీ మొత్తానినే అభివృద్ధి పథంలో నడిపిస్తానని మాట ఇస్తున్న అని తెలియజేశారు

# నిరంతర ప్రజాసేవతో ముందుకు 12వ వార్డు అభివృద్ధే లక్ష్యం


**ములుగు జిల్లా,ఫిబ్రవరి14 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఏటూరు నాగారం మండలంలోని 12వ వార్డు మెంబర్ కొయ్యల కృష్ణవేణి ప్రజాసేవలో నిరంతరం నిమగ్నమై, ప్రతి వాడను, ప్రతి కాలువను, ప్రతి రోడ్డును సందర్శిస్తూ ప్రజల సమస్యలను దగ్గరగా తెలుసుకుంటూ పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న ఆమె,“ఎలాంటి ఆపద వచ్చినా మీ ఇంట్లో బిడ్డలా నేనున్నాను. ప్రతి ఒక్కరు ఏ సమస్య ఉన్నా నన్ను నిస్సంకోచంగా సంప్రదించవచ్చు” అని భరోసా ఇస్తున్నారు. ఒక ఇంట్లో అక్కలా, చెల్లెల్లా, ఆడబిడ్డలా ప్రజలకు అండగా నిలుస్తూ, ప్రతి చిన్న సమస్యనూ పెద్దగా భావించి పరిష్కారం చూపే విధంగా పనిచేస్తున్నారు. యువతగా ఉండటం వల్ల ఎంతో ఉత్సాహంతో, పట్టుదలతో ప్రజాసేవలో ముందుకు సాగుతూ, ఈసారి 12వ వార్డును సంపూర్ణ అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని సంకల్పించారు. 12వ వార్డు ప్రజలు ఆమె సేవలను ప్రశంసిస్తూ, అభివృద్ధి పథంలో వార్డును నిలబెట్టేందుకు తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. మీకు కావాలంటే దీనిని వార్తా పత్రిక స్టైల్, ఫ్లెక్స్ బ్యానర్, సోషల్ మీడియా పోస్టు, లేదా ప్రకటన రూపంలో కూడా మార్చి ఇవ్వగలను.

# యువనేత విష్ణువర్ధన్ జన్మదిన వేడుకలకు ఎమ్మెల్యే ఆశీస్సులు



**పరకాల, ఫిబ్రవరి14 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ యువజన శక్తి ఉత్సాహంగా ఉప్పొంగింది. శనివారం పరకాల కాంగ్రెస్ యువజన నాయకుడు మునిగంటి విష్ణువర్ధన్ పుట్టినరోజు సందర్భంగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి నివాసంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే, యువ నాయకుడు విష్ణువర్ధన్ ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. పార్టీ అభివృద్ధి కోసం యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆశీస్సులు తీసుకున్న విష్ణువర్ధన్, పార్టీ పట్ల తన నిబద్ధతను పునరుద్ఘాటించారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పరకాల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దుప్పటి సాంబశివుడు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ పసుల అన్నస్వామి, కాంగ్రెస్ నాయకులు దొమ్మటి బాపురావు, సుధామల్ల కిషోర్, గూడెల్లి కార్తీక్, ఎండీ సల్మాన్ తదితరులు పాల్గొని విష్ణువర్ధన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# పేకాట స్థావరంపై పోలీసులు దాడి 9 మంది అరెస్ట్



**అన్నమయ్య జిల్లా: పుంగనూరు; ఫిబ్రవరి 14 (ఆంధ్రప్రదేశ్: పి సి డబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** చౌడేపల్లి మండలంలో పేకాట స్థానాలకు పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న 9 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగేశ్వరరావు తెలిపారు. ఆయన కథనం మేరకు చౌడేపల్లి మండలం బోయకొండ గ్రామంలో జగదీష్ వ్యక్తికి చెందిన ఓ భవనంలో పేకాట ఆడుతున్నట్లు రాబడిన సమాచారం మేరకు దాడులు నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. పేకాట ఆడుతున్న తొమ్మిది మంది జూదరులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి నగదు రూ 1,78,200లు, తొమ్మిది సెల్ ఫోన్‘లు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పేకాట ఆడుతున్నారు మదనపల్లి, బెంగళూరు, ముల్బాగల్ ప్రాంతాలకు చెందినవారని ఆయన తెలిపారు.

## స్థానిక సంస్థల మాజీ ప్రజా ప్రతినిధులకు పెన్షన్ ఏర్పాటు చేశాలి: ప్రతికంఠం పూర్ణచందర్ రాజు



**ఆత్మకూరు ఫిబ్రవరి 14 (పిసిడబ్ల్యూ న్యూస్):**తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల మాజీ ప్రజా ప్రతినిధులు చాలా వరకు బీద మధ్యతరగతి పరిస్థితి లో వున్నారు. ఐదు సంవత్సరాలు పాలకులుగా పరిపాలన సాగించి గ్రామాల అభివృద్ధికి ప్రజల అభివృద్ధికి కృషి చేసి పదవి విరమణ తర్వాత కూడ వారి ప్రాంతం అభివృద్ధికే కృషిచేస్తున్నారు.ఎక్కువ శాతం బీద పరిస్థితి లో వున్నారు. స్థానిక సంస్థలలో సర్పంచ్ యంపిటీసి జెడ్పీటీసీ మండల పరిషత్ అధ్యక్షులు జిల్లా పరిషత్ అధ్యక్షులు గా పనిచేసారు. జిల్లా పరిషత్ అధ్యక్షులకు స్టేట్ మినిష్టర్ క్యాడర్ వున్నప్పటికి పెన్షన్ లేదు కావున స్థానిక సంస్థల మాజీ ప్రజా ప్రతినిధులకు పెన్షన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ను కోరుతున్నాం. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు ప్రతికంఠం హేమలత రాజు, మాజీ సర్పంచ్ లు ఎరుకల స్వామి, బి.లక్ష్మమ్మ,జోగు, పిచ్చమ్మ, యాస బుచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఎన్నికైన మల్లేశం గౌడ్



**సూర్యాపేట జిల్లా,ఫిబ్రవరి 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్ర సదస్సులో రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన జిల్లా ప్రతినిధుల సమక్షంలో నూతనంగా కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీని ఎన్నుకోవడం జరిగింది దానిలో రాష్ట్ర కమిటీ సభ్యునిగా హన్మకొండ జిల్లా పరకాల మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన గౌడ ముద్దు బిడ్డ ఆముదాలపేల్లి మల్లేశం గౌడ్ ను రాష్ట్ర కమిటి సభ్యులుగా ఎన్నుకున్నరు. ఈ సందర్భంగా మల్లేశం గౌడ్ మాట్లాడుతు గీత వృత్తినే నమ్ముకొని వృత్తిని చేస్తున్న గీత కార్మికులకు ఏలాంటి ఆపద వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తానని నన్ను రాష్ట్ర కమిటి సభ్యులుగా ఎన్నుకున్న రాష్ట్ర అధ్యక్షుడు ఎం వి రమణ గారికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లకు హన్మకొండ జిల్లాకు చెందిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌని సాంబయ్య గౌడ్ జిల్లా అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి రంజిత్ గౌడ్ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.

## ఘనంగా మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు



**అన్నమయ్య జిల్లా: పుంగనూరు : ఫిబ్రవరి 14 (ఆంధ్రప్రదేశ్: పి సి డబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** చౌడేపల్లి మండలం లోని స్థానిక ఎస్సీ బాలురు, బాలికల వసతి గృహాలలో మాజీ ముఖ్యమంత్రి దానం సంజీవయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారుమీ వార్డన్లు దీప,సురేష్ ల ఆధ్వర్యంలో దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. దళిత కుటుంబంలో పుట్టి అత్యున్నత శిఖరాలను అధిరోహించిన దామోదరం సంజీవయ్య నేటి సమాజానికి ఆదర్శప్రాయుడని కొనియాడారు. రాష్ట్రంలో ఆయన తీసుకున్న చర్యలపై విద్యార్థులకు వివరించారు. చిన్నతనం నుంచి దామోదరం సంజీవయ్య ఎదుర్కొన్న సవాళ్లను వివరించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ భవన వ్యవస్థాపక అధ్యక్షుడు బ్యాంకు రెడ్డప్ప, సిఐటియు మండల కార్యదర్శి డాక్టర్ చంద్ర, బహుజన సేవా సమితి నాయకులు కృష్ణమూర్తి, బస్టాండ్ శేఖర, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# పుస్తెలమ్ముకొని పోటీ చేసిన సంజయ్‌కి..కార్పొరేటర్ అభ్యర్థులకు ఇచ్చిన లక్షలాది రూపాయలు ఎక్కడివి..

**ఎన్నికల ఫలితాలపై.. గెలుపు ఓటములపై విశ్లేషించుకుంటాం**

**మరింత రెట్టింపుతో ప్రజా సమస్యలపై గొంతెత్తుతాం**

**ఎంఐఎంకు ఓటేసి ఆదరించిన కరీంనగర్ ప్రజలకు కృతజ్ఞతలు**

**ఘనంగా ఎంఐఎం పార్టీ 68వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**

**ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్**

**కరీంనగర్ టౌన్ ఫిబ్రవరి 14(పిసిడబ్ల్యూ న్యూస్):** మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై విశ్లేషించుకుని, ప్రజా సమస్యలపై రెట్టింపైన ఉత్సాహంతో గొంతెత్తుతామని ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ అన్నారు. శనివారం నగరంలోని ఎంఐఎం పార్టీ కార్యాలయంలో పార్టీ 68వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ.. ఎంఐఎం పార్టీని ఆదరించి ఓటేసిన కరీంనగర్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా తీర్పును శిరసావహిస్తామని, కొన్ని డివిజన్లలో ఓటమిపై లోపాలను సరిదిద్దుకొని ప్రజా సమస్యలపై అలుపెరగకుండా పోరాడుతామని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలకు సంబంధించి తమ పార్టీ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీకి నివేదికను అందజేసినట్లు పేర్కొన్నారు. హై కమాండ్ ఆదేశాల మేరకు త్వరలో కొన్ని డివిజన్లలో ప్రస్తుత కమిటీలను మార్చి, నూతన కమిటీలను నియామకం చేస్తామన్నారు. గడచిన అసెంబ్లీ ఎన్నికల్లో పుస్తెలమ్ముకొని పోటీ చేశానని చెప్పుకున్న బండి సంజయ్ కి,




ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి కార్పొరేటర్ అభ్యర్థులకు తలా ఒక్కరికి లక్షలాది ఇచ్చి గెలవడానికి ఏవిధంగా సాయం చేశారని, దేశం కోసం, ధర్మం కోసమని నినదించే బండికి ఇంత డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందో కరీంనగర్ ప్రజలు గమనించాలన్నారు.దేశంలో కుల, మత, వర్గ, లింగ విభేదాలు సృష్టించి బిజెపి ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతోందని, ఇటువంటి ప్రమాదకర పరిస్థితుల్లో భూమికోసం భుక్తి కోసం పీడిత తాడిత ప్రజల విముక్తి కోసం పార్లమెంటు వేదికగా గొంతెత్తి ప్రశ్నించేది కేవలం ఎంఐఎం పార్టీ మాత్రమేనని, దేశంలో దళితులకు, ముస్లింలకు, బడుగు బలహీన వర్గాలకు, పీడితులకు, అణగారిన వర్గాలకు అండగా నిలిచి వారి పట్ల జరుగుతున్న దాడులు, దమననీతి, పాలకులు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక కార్యకలాపాలను పార్లమెంట్లో నినదించి, పాలకుల మెడలు వంచి,



నిగ్గుదీసి, బాధితుల పక్షాన నిలిచేది కేవలం ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ మాత్రమేనన్నారు. ఎంఐఎం జిందాబాద్.. అసదుద్దీన్ ఒవైసీ.. అక్బరుద్దీన్ ఒవైసీ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. స్వీట్లు పంచి పెట్టారు. నూతనంగా ఎన్నికైన ముగ్గురు కార్పొరేటర్లకు ఎంఐఎం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి బర్కత్ అలీ, జాయింట్ సెక్రటరీలు హాఫీజ్ యూసుఫ్, ఆతిన, కార్పొరేటర్లు మొహసీన్ మొహియుద్దీన్, ఇబ్రహీం, నాయకులు అరిఫ్ అహ్మద్, బాబుజానీ, అజర్, సాజిద్, అంజద్ ఖాన్, అక్బర్, అన్వర్ ఖాన్, సురేశ్, గాలి రాజు, సుధాకర్, తాజుద్దీన్, షోయబ్ తహెవర్, అజీముల్లా ఖాన్, మజారోద్దీన్, వాజిద్ అలీఖాన్, షాకిర్ నహ్దా, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీలో చేరిన మరో ఇద్దరు ఇండిపెండెంట్ కార్పొరేటర్లు...

**- కేంద్ర మంత్రి బండి సంజయ్ సమక్షంలో చేరిన 17, 39వ డివిజన్ కార్పొరేటర్లు.**

**- కాషాయ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించిన బండి సంజయ్**

**- బీజేపీతో సంప్రదింపులు చేస్తున్ మరో ఆరుగురు కార్పొరేటర్లు**

**- మేయర్ ఎన్నిక నాటికి బీజేపీ బలం అనూహ్యంగా పెరిగే అవకాశం.**

**కరీంనగర్,ఫిబ్రవరి14(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థులుగా పోటీ చేసి గెలుపొందిన ఇద్దరు కార్పొరేటర్లు కొద్దిసేపటి క్రితం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సమక్షంలో బీజేపీలో చేరారు. 17వ డివిజన్ కార్పొరేటర్ వేముల కవిత చంద్రశేఖర్, 39వ డివిజన్ కార్పొరేటర్ మాసం గణేశ్ ఈరోజు హైదరాబాద్ కు విచ్చేసి బీజేపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. వారిద్దరికీ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కాషాయ కండువా కప్పి బీజేపీలోకి



ఆహ్వానించారు. నిన్న(శుక్రవారం) రాత్రి ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే 1 ఇండిపెండెంట్, మరో ఏఐఎఫ్ బీ కార్పొరేటర్ కరీంనగర్ ఎంపీ కార్యాలయానికి విచ్చేసి బండి సంజయ్ సమక్షంలో పార్టీలో చేరిన సంగతి తెలిసిందే. తాజాగా మరో ఇద్దరి చేరికతో బీజేపీ బలం 34కు చేరింది. ఎక్స్ అఫిషియో హోదాలో స్థానిక ఎంపీ బండి సంజయ్‌కు కూడా ఒక ఓటు ఉంటున్నందున మొత్తం బీజేపీ బలం 35కు చేరింది. వీరు గాకుండా మరో ఆరుగురు కార్పొరేటర్లు బీజేపీ నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీకి మేయర్ పదవి దక్కడం ఖాయమైంది. దీనిని దృష్టిలో ఉంచుకున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ కు చెందిన కార్పొరేటర్లు, ఇండిపెండెంట్



కార్పొరేటర్లు బీజేపీలో చేరే అంశంపై తర్జన భర్జన పడుతున్నారు. కరీంనగర్ లో అభివృద్ధి పనుల కోసం కేంద్రం నుండి అధిక నిధులు వస్తుండటం, బీజేపీలో చేరితేనే తమ తమ డివిజన్ లో ఎక్కువ అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు మరింత దగ్గర కావొచ్చనే భావనతో బీజేపీ ముఖ్య నేతలతో మంతనాలు జరుపుతున్నారు. కాంగ్రెస్ గత రెండేళ్ల పాలనలో కరీంనగర్ కార్పొరేషన్ అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడం రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు లేకపోవడం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకున్న ఆయా కార్పొరేటర్లు కాంగ్రెస్ లో చేరితే పెద్దగా ఒరిగేదేమీ ఉండదనే అభిప్రాయానికి వస్తున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీలో చేరే కార్పొరేటర్ల సంఖ్య అనూహ్యంగా పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి.

# కల్లూరు తెలంగాణ గ్రామర్ స్కూల్‌లో విలువల బోధనకు వేదికైన మాతృ దేవోభవ.. పితృ దేవోభవ కార్యక్రమం



**తల్లిదండ్రులే తొలి మార్గదర్శకులు**

**తల్లిదండ్రుల త్యాగాలు అపారమైనవి**

**మన భవిష్యత్తుకు బలమైన పునాది వారే**

**తల్లిదండ్రులు దేవునితో సమానం**

**కల్లూరు, ఫిబ్రవరి 14 (పిసిడబ్ల్యూన్యూస్) :**కల్లూరు తెలంగాణ గ్రామర్ స్కూల్‌లో విద్యతో పాటు జీవిత విలువలను విద్యార్థులకు చేరువ చేయాలనే ఉద్దేశంతో "మాతృ దేవోభవడ పితృ దేవోభవ" కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు హాజరై, పాఠశాల ప్రాంగణం ఉత్సాహభరితంగా మారింది.కార్యక్రమం మొత్తం భావోద్వేగభరిత వాతావరణంలో సాగింది. తల్లిదండ్రులు తమ పిల్లల పెంపకంలో ఎదురైన అనుభవాలను, త్యాగాలను, ఆనందాలను వేదికపై పంచుకోవడం అందరినీ హృదయపూర్వకంగా కదిలించింది. పలువురు తల్లిదండ్రులు తమ అనుభవాలను చెబుతూ భావోద్వేగానికి లోనయ్యారు.ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో పిల్లలకు విద్యతో పాటు తల్లిదండ్రుల పట్ల గౌరవం, కృతజ్ఞత వంటి విలువలు చాలా అవసరమని తెలిపారు. ఇలాంటి విలువధారిత కార్యక్రమాలు పిల్లల్లో సంస్కారం, మానవత్వాన్ని పెంపొందిస్తాయని వారు అభిప్రాయపడ్డారు. తెలంగాణ గ్రామర్ స్కూల్లో నిర్వహించిన మాతృదేవో భవ పితృదేవో భవ కార్యక్రమం హృదయాలను హత్తుకునేలా జరిగింది. తెలంగాణ గ్రామర్ స్కూల్ ఇంగ్లీష్ మీడియం ప్రిన్సిపాల్ ఇస్మాయిల్ అధ్యక్షత నిర్వహించిన ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న క్రిసెంట్ ఫార్మా కంపెనీ అధినేత, తెలంగాణ గ్రామర్ స్కూల్ చైర్మన్ ఎస్ కే జానీమియా మాట్లాడుతూ చదువుతో పాటు సంస్కారం కూడా సమానంగా అవసరమని అన్నారు. విద్యార్థి జీవితంలో విద్య ఎంత ముఖ్యమో, తల్లిదండ్రుల పట్ల గౌరవం అంతకంటే గొప్పది అని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ తల్లిదండ్రుల పాదాలకు నమస్కరించి ఆశీర్వాదాలు తీసుకోవడం





ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పిల్లల ప్రేమాభిమానాలు చూసి తల్లిదండ్రులు ఆనందభాష్పాలతో తడిసి ముద్దయ్యారు. తల్లిదండ్రుల ప్రేమ వెలకట్టలేనిదని, వారి రుణం ఎప్పటికీ తీర్చలేనిదని విద్యార్థులు తమ మాటల ద్వారా వ్యక్తపరిచారు.సభ్య సమాజ నిర్మాణానికి కుటుంబ విలువలు, పెద్దల పట్ల గౌరవం ఎంతో అవసరమని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు పిల్లల్లో కృతజ్ఞతాభావం, వినయం, బాధ్యత వంటి మంచి గుణాలను పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమం ముగింపులో తల్లిదండ్రులు యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేసి, ఇలాంటి విలువల ఆధారిత కార్యక్రమాలు తరచుగా నిర్వహించాలని కోరారు. విద్యతో పాటు సంస్కారం కలిగిన భావి పౌరులను తీర్చిదిద్దే దిశగా ఇది ఒక ఆదర్శవంతమైన ప్రయత్నమని అందరూ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయునిలు,



ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు పాఠశాల చైర్మన్ జానీమియా గారిని ప్రిన్సిపాల్ ఇస్మాయిల్ గారిని, తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు. పిల్లల్లో విలువల బోధనకు ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని వారు కోరారు.మొత్తంగా "మాతృ దేవోభవడ పితృ దేవోభవ" కార్యక్రమం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల మన్ననలను పొందుతూ ఘన విజయంగా ముగిసింది. ఈ కార్యక్రమం పాఠశాల చరిత్రలో ఒక మరిచిపోలేని ఘట్టంగా నిలిచింది.

# ఏదులాపురం చైర్మన్ పదవి మాదిగలకు కేటాయించాలి

**అధిక సీట్లు.. ఎక్కువ ఓట్లు కలిగి ఉన్నవి మాదిగలవే**

**విలేకరుల సమావేశంలో ఎం ఆర్ పి ఎస్ జిల్లా కార్యదర్శి కనకం జనార్ధన్ మాదిగ విజ్ఞప్తి**

**ఖమ్మం, ప్రతినిధి ఫిబ్రవరి 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఏదులాపురం చైర్మన్ పదవి ఎస్సీలకు రిజర్వు చేయబడిందని, ఏదులాపురం మున్సిపల్ ఎన్నికలలో ఎస్సీ మాదిగలు నాలుగు సీట్లు గెలుచుకున్నారని, ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు సభ్యులు గెలుపొందారని అధిక స్థానాలు దక్కించుకున్న మాదిగలకు చైర్మన్ పదవి కేటాయించాలని ఎమ్మార్పీఎస్ , ఎం ఎస్ పి జిల్లా కార్యదర్శి, ఖమ్మం రూరల్ మండల ఇన్చార్జి కనకం జనార్ధన్ మాదిగ కోరారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏదులాపురం మున్సిపాలిటీలోనూ, పాలేరు నియోజకవర్గంలోనూ జిల్లా లోను అటు రాష్ట్రంలోనూ మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఓటు బ్యాంకింగ్ జనాభా అత్యధికంగా ఉందని, రిజర్వేషన్ల ప్రాతిపదికన తమ సామాజిక వర్గానికి ఏదులాపురం మున్సిపల్ చైర్మన్ పదవి దక్కే అవకాశం ఉందని, కానీ జరుగుతున్న పరిణామాలు అందుకు భిన్నంగా ఆందోళనకరంగా ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలలో ఎక్కువ స్థానాలు మాదిగ సామాజిక వర్గానికి చెందినవారు గెలుపొందారని అటువంటి వారికి కాదని మరొకరికి కట్ట పెట్టాలనే ప్రయత్నాలు మంచిది కాదని అన్నారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మాదిగ సామాజిక వర్గం అక్కున చేర్చుకొని అండదండగా నిల్చారని, ఏ ఎన్నిక వచ్చిన, పార్టీకి ఎంత కష్టం వచ్చినా దశాబ్దాల తరబడి వెన్నంటే నిలిచారని అటువంటివారిని కాదని మరొక సామాజిక వర్గానికి ఇవ్వాలనే ప్రయత్నాలు మంచి పరిణామం కాదని అన్నారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక దృష్టి సారించి భవిష్యత్తు ను దృష్టిలో ఉంచుకొని న్యాయబద్ధంగా మాదిగలకు దక్కే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. రిజర్వేషన్ల లోను, ఓటు బ్యాంకింగ్ లోను, జనాభా లోను మున్సిపల్ ఎన్నికల్లో అధిక స్థానాలు మాదిగ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులే విజయం సాధించారని అటువంటి వారికే చైర్మన్ పదవి కేటాయించాలని కోరారు. ఈ




సందర్భంగా ఎస్సీ ఉపకులం డక్కల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్నే రామారావు మాట్లాడుతూ.. ఏదులాపురం మున్సిపాలిటీ అదేవిధంగా పాలేరు నియోజకవర్గంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు రిజర్వేషన్ల ప్రాతిపదికన మాదిగలకే కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దయతో ఆలోచించి మంచి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

# చిన్న పత్రికలపై చిన్న చూపు తగదు

**ఆర్ఎన్ఐ రిజిస్ట్రేషన్ ఉన్న అన్ని పత్రికలకు అక్రెడిటేషన్లు ఇవ్వాలి**

**టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య డిమాండ్**

**17న ఛలో సమాచార భవన్‌కు పిలుపు**

**హైదరాబాద్ ఫిబ్రవరి 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆర్ఎన్ఐ, పీఆర్ జీఐ రిజిస్ట్రేషన్ ఉన్న అన్ని పత్రికలకు ఎంప్యానల్‌మెంట్ తో సంబంధం లేకుండా అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17వ తేదీన ఛలో సమాచార భవన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు,రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ లోని రాష్ట్ర సమాచార పౌరసంబధాల కమిషనర్ కార్యాలయం(సమాచారభవన్) ఎదుట జరిగే జర్నలిస్టుల నిరసన కార్యక్రమంలో వివిధ పత్రికల నిర్వహకులు,జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం 44 వేలకు పైగా అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు ప్రకటించినప్పటికీ కేవలం ఎంపానల్మెంట్ అయిన కొన్ని పత్రికలకు, చానళ్ళకు మాత్రమే ఇస్తూ మిగతా పత్రికలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో ఎంపానల్మెంట్ తో సంబంధం లేకుండా ఆర్ఎన్ఐ గుర్తింపు ఉన్న అన్ని పత్రికలకు ఆయా పత్రికల సర్క్యులేషన్ ఆధారంగా జర్నలిస్టులందరికి అక్రెడిటేషన్ కార్డులిచ్చే వారని, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఆ పద్ధతిని తుంగలో తొక్కి పత్రికలకు ఎంప్యానల్ ముసుగు తొడిగి, నిబంధనల పేరుతో చిన్న,మధ్య తరహా పత్రికలను పాతాళానికి తొక్కారని ఆయన ధ్వజమెత్తారు. తెలంగాణ స్వరాష్ట్రంలోనే చిన్న మధ్య తరహా పత్రికలకు, వాటిలో పనిచేస్తున్న జర్నలిస్టులకు తీరని అన్యాయం జరిగుతుందని మామిడి సోమయ్య ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ తొలి ప్రభుత్వం జర్నలిస్టులకు చేసిన అన్యాయంపై ఆనాడు గొంతెత్తిన ఈనాటి పాలకులు అధికారంలోకి వచ్చి



రెండేండ్లయినా అనేక పత్రికలను ఎంపానల్మెంట్ చేయకుండా జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్నారనని ఆయన ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే జర్నలిస్టులందరికీ సరైన న్యాయం చేస్తామని నమ్మబలికిన పాలకులు మీడియా అక్రిడిటేషన్ ల విషయంలోనే వివక్ష చూపుతూ చిన్న మధ్య తరహా పత్రికలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఆర్ఎన్ఐ,పీఆర్జీఐ గుర్తింపు ఉన్న పత్రికలను ఎంప్యానల్ చేయకుండా రెండేళ్లుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, కనీసం అక్రెడిటేషన్లు ఇవ్వకుండా అణిచివేస్తున్నారని ధ్వజమెత్తారు. మరోవైపు ఎంప్యానల్ లిస్టులో ఉన్న చాలా పత్రికలను ఆ జాబితా నుంచి తొలగించి జర్నలిస్టులను ఆందోళనకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సందర్భాన్ని బట్టి దరఖాస్తు చేసుకుంటే అడ్వర్టయిజ్మెంట్ తో పాటు అక్రెడిటేషన్ ఇచ్చే వారని, ప్రస్తుతం అడ్వర్టయిజ్మెంట్ల సంగతి దేవుడెరుగు గానీ కనీసం అక్రెడిటేషన్ కార్డు ఇవ్వకపోవడం దుర్మార్గమని అన్నారు. ప్రభుత్వ వివక్ష కారణంగా స్వరాష్ట్రంలో చిన్న పత్రికల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని, దీని వల్ల ఎంతో మంది సీనియర్ జర్నలిస్టులకు పత్రికల నిర్వహణ భారమవుతుందని అన్నారు. దీనికి తోడు మూలిగే నక్కమీద తాటికాయపడ్డట్టు ఎంప్యానల్‌లో ఉన్న పత్రికలను ఆ జాబితా నుంచి తొలగించడం చాలా భాదాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పునరాలోచన చేసి ఆర్ఎన్ఐ,పీఆర్జీఐరిజిస్ట్రేషన్ కలిగి ఉన్న ప్రతి పత్రికకు అక్రిడిటేషన్ కార్డులు గతంలో మాదిరిగా ఇవ్వాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆయా పత్రికలకు ఎంప్యానల్‌తో సంబంధం లేకుండా నెలకు కనీసం ఒక అడ్వర్టయిజ్మెంట్ ఇవ్వాలని, ప్రింటింగ్ ప్రెస్ కోసం ఒక ఎకరం భూమిని ప్రభుత్వ నామినల్ ధరకు ఇచ్చి ప్రింటింగ్ ప్రెస్ ఏర్పాటుకు రుణ సదుపాయం కల్పించాలని కోరారు. జర్నలిస్టులకు అక్రెడిటేషన్ ఉన్న జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీలో ప్రయాణించేందుకు ఉచిత బస్ పాస్ ఇవ్వాలని, హెల్త్‌కార్డులు,భీమా సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

# పురపోరులో 'పొంగులేటి' మ్యాజిక్

**- 10 రోజుల్లో.. 249 వార్డుల్లో ప్రచారం**

**- 70 శాతం సక్సెస్ రేటుతో 174 వార్డుల్లో గెలుపు**

**- శీనన్న వ్యూహంతో ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్ పురపాలికల్లో హస్తం ప్రభంజనం!**

**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మున్సిపల్ ఎన్నికల కురుక్షేత్రంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి (శీనన్న) ఒక అజేయ శక్తిగా నిలిచారు. ముఖ్యమంత్రి రేవంతన్న అప్పగించిన బాధ్యతను సవాలుగా తీసుకున్న ఆయన, తన వ్యూహ చతురతతో ఫలితాలను తలకిందులు చేశారు. కేవలం అంకెలే కాదు.. ఆ అంకెల వెనుక ఉన్న ఆయన కష్టం, ప్రచారం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కేవలం 10 రోజుల్లోనే అసాధ్యమనుకున్న సమీకరణాలను సుసాధ్యం చేసి చూపారు. **ఉమ్మడి ఖమ్మం జిల్లా : శీనన్న అడ్డాలో తిరుగులేని హవా!** తన సొంత గడ్డపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గాలివాటం కాదు.. సునామీ సృష్టించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఆయన అడుగుపెట్టిన ప్రతిచోటా కాంగ్రెస్ జెండా రెపరెపలాడింది. **ఏదులాపురం :** 32 వార్డుల్లో ఏకంగా 24 చోట్ల జయకేతనం ఎగురవేసి సత్తా చాటారు. **కొత్తగూడెం కార్పొరేషన్ :** సింగరేణి హృదయంలో 22 స్థానాలను కైవసం చేసుకున్నారు. **కల్లూరు అండ్ సత్తుపల్లి :** కల్లూరులో 12, సత్తుపల్లిలో 17 వార్డులను హస్తం ఖాతాలో వేశారు. **ఇల్లందు అండ్ అశ్వారావుపేట :** ఇక్కడ కూడా ఇల్లందులో 19, అశ్వారావుపేటలో 17 స్థానాల్లో గెలిచి తన పట్టును నిరూపించుకున్నారు. **ఓరుగల్లు కోటపై హస్తం జైత్రయాత్ర !** రేవంతన్న ఆశీస్సులతో ఉమ్మడి వరంగల్ జిల్లా బాధ్యతలను స్వీకరించిన శీనన్న, అక్కడ కూడా ప్రత్యర్థుల కోటలను బద్దలు కొట్టారు. **భూపాలపల్లి :** అత్యంత కీలకమైన ఈ మున్సిపాలిటీలో 16 వార్డులను గెలుచుకుని పట్టు సాధించారు. **పరకాల అండ్ స్టేషన్ ఘన్‌పూర్ :** పరకాలలో 13, స్టేషన్ ఘన్‌పూర్‌లో 13 స్థానాలను గెలిపించి జిల్లాలో కాంగ్రెస్ ప్రాభవాన్ని చాటారు.



**గణాంకాలే సాక్ష్యం :** 249 వార్డుల ప్రచారం.. 174 స్థానాల్లో విజయం!మొత్తంగా మంత్రి పొంగులేటి ప్రచారం నిర్వహించిన 249 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ 174 స్థానాలను గెలుచుకుంది. అంటే సుమారు 70 శాతం గెలుపు రేటుతో ఆయన 'మోస్ట్ సక్సెస్‌ఫుల్' లీడర్‌గా నిలిచారు. పగలు రేయి ఏకంచేసి ఆయన సాగించిన సుడిగాలి పర్యటనలు, రేవంతన్న సంక్షేమ పథకాలపై ప్రజలకు కల్పించిన భరోసా ఓట్ల వర్షంగా కురిసింది. మాట ఇస్తే తప్పని నైజంతో, అభివృద్ధిపై ఉన్న నిబద్ధతతో శీనన్న ప్రజాప్రభుత్వంలో తన మార్క్ రాజకీయాలను మరోసారి చాటిచెప్పారు.

# బీజేపీ పార్టీని ఓడించేందుకు కాంగ్రెస్ బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందం: డా. జాడి రామరాజు ఆరోపణ

**ఏటూరునాగారం , ఫిబ్రవరి 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఏటూరునాగారం మండల కేంద్రంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు డా. జాడి రామరాజు మాట్లాడుతూ, బీజేపీ పార్టీని ఓడించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు లోపాయికారి ఒప్పందం చేసుకున్నాయని ఆరోపించారు. ఈ ఒప్పందం కారణంగానే ములుగు మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ పార్టీ రెండో స్థానానికి పరిమితమైందని అన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని, అయితే ప్రజల సమస్యలపై పోరాడుతూనే కాంగ్రెస్‌బీఆర్ఎస్ పార్టీల చీకటి ఒప్పందాన్ని బట్టబయలు చేస్తామని స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీ నాయకురాలు, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి మరియు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు మధ్య జరిగిన ఒప్పందం మేరకు,ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీలో 4 వేల జనాభా కలిగిన ముదిరాజ్, పద్మశాలి, బెస్త సామాజిక వర్గాలకు టికెట్ ఇవ్వకుండా, కేవలం 30 మంది కలిగిన సామాజిక వర్గానికి టికెట్ ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి దొరబాబును సర్పంచ్‌గా గెలిపించారని ఆరోపించారు. అదే ఒప్పందం కొనసాగింపులో భాగంగా నేడు ములుగు మున్సిపాలిటీ చైర్మన్ పదవిని కూడా లోపాయికారి పొత్తులో భాగంగా మంత్రి కి గిఫ్ట్‌గా ఇచ్చారని విమర్శించారు. ములుగు జిల్లా ప్రజలు మేధావులని, కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ, ఎంఐఎం పార్టీలు ఒక్క గూటి పక్షులని గుర్తించాలని పిలుపునిచ్చారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్ ప్రకటించి జీవో విడుదల చేసినప్పటికీ,కాంగ్రెస్ బీఆర్ఎస్ నాయకులు ఎందుకు దానికి అడ్డుపడుతున్నారో ప్రజలు ఆలోచించాలని అన్నారు. మంగపేట, తాడ్వాయి, కన్నాయిగూడెం ప్రాంతాల ప్రజలకు రెవెన్యూ డివిజన్ ఎంతో అవసరమని, అయినా కూడా కాంగ్రెస్ బీఆర్ఎస్ నాయకులు ఎందుకు మౌనం వహిస్తున్నారో అర్థం చేసుకోవాలని కోరారు. ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్ ఆమోదాన్ని అడ్డుకుంటున్న నాయకులను ప్రజలు తగిన రీతిలో నిలదీయాలని డా. జాడి రామరాజు డిమాండ్ చేశారు.



## విలువలే నిజమైన విద్యకు బలం సర్పంచ్ ల్యాద శ్యాంరావు



**మల్లంపల్లి, ఫిబ్రవరి 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** భవిష్యత్ తరాలను బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దాలంటే విలువలతో కూడిన విద్య తప్పనిసరి అని మల్లంపల్లి గ్రామ సర్పంచ్ ల్యాద శ్యాంరావు స్పష్టం చేశారు.మల్లంపల్లిలోని భవాని పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించగా, ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ విద్యార్థులకు మార్గదర్శక ప్రసంగం చేశారు."పుస్తకాల జ్ఞానం ఒక్కటే సరిపోదుడ నైతిక విలువలు, క్రమశిక్షణ, పెద్దల పట్ల గౌరవం ఉన్నప్పుడే విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుతారు. దేశానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలంటే విలువల విద్య అవసరం" అని ఆయన స్పష్టం చేశారు.కార్యక్రమంలో విద్యార్థులు తమ తల్లిదండ్రుల పాదాలను కడిగి కృతజ్ఞతాభివందనం తెలిపిన దృశ్యాలు హృదయాన్ని హత్తుకున్నాయి. ఈ వినూత్న కార్యక్రమం ద్వారా తల్లిదండ్రుల పట్ల గౌరవభావన పెంపొందించేందుకు పాఠశాల యాజమాన్యం చేస్తున్న ప్రయత్నాలను గ్రామ పెద్దలు అభినందించారు.ముగింపులో పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన ఉపాధ్యాయులను సన్మానించి బహుమతులు అందజేశారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసింది.

## చోరీకి పాల్పడిన అనుమానితుల ఫోటోలను విడుదల చేసిన ధర్మసాగర్ పోలీసులు



**హన్మకొండ ,ఫిబ్రవరి 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ధర్మసాగర్ పరిధిలోని కరుణాపురం చర్చిలో ప్రార్థనలు అనంతరం హనుమకొండ భీమారం ప్రాంతానికి చెందిన విజయలక్ష్మి అనే మహిళ మెడలోని పుస్తెలతాడు చోరీకి గురైంది. దీంతో ఫిర్యాదు అందుకున్న ధర్మసాగర్ పోలీసులు, దర్యాప్తు అనంతరం ఈ చోరీ కి పాల్పడిన ఇద్దరు అనుమానిత మహిళలకు సంబంధించి విడుదల చేశారు. ఎవరైనా ఈ మహిళలను గుర్తిస్తే 8712685127 నంబర్ కు సమాచారం ఇవ్వాలని ధర్మసాగర్ ఇన్స్ స్పెక్టర్ తెలిపారు.

## షార్ట్ సర్క్యూట్‌తో కిరాణా షాప్ దగ్ధం



**ములుగు జిల్లా, ఫిబ్రవరి 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :**ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరు గ్రామంలో కరెంట్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కిరాణా షాప్‌లో అగ్నిప్రమాదం జరిగింది.పద్మ వెంకటేశ్వర్లు దంపతుల కిరాణా షాప్ పూర్తిగా కాలిపోయింది.షాప్‌లో ఉన్న సరుకులు, నగదు, ఫర్నిచర్ మొత్తం అగ్నికి ఆహుతయ్యాయి.ఈ ప్రమాదంలో లక్ష రూపాయలకుపైగా ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు.సంఘటన సమాచారం అందుకున్న గ్రామస్తులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు.అదృష్టవశాత్తూ ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.




# సీనియర్ జర్నలిస్ట్ మెరుగు చంద్రమోహన్ (సీఎం) జన్మదిన వేడుకలు

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా,ఫిబ్రవరి14,(పిసిడబ్ల్యూ న్యూస్ ):** సీనియర్ జర్నలిస్టు మెరుగు చంద్రమోహన్ (సీఎం) జన్మదిన వేడుకలు శనివారం కుషాయిగూడలోని శ్రీరామ్ బ్రేకర్స్ అండ్ స్వీట్స్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, జర్నలిస్టులు జన్మదిన వేడుకలకు హాజరై కేకు కట్ చేయించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి, డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త అంజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షులు కేశెట్టి ప్రసాద్, హైకోర్టు న్యాయవాది సుంకర నరేష్, బిఆర్ఎస్ నాయకుడు గంప కృష్ణ గుప్తా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజానికి అంకితభావంతో పనిచేస్తున్న చంద్రమోహన్ సేవలను ప్రశంసించారు. "నిజాయితీ, నిబద్ధత, ప్రజా పక్ష ధోరణి కలగలిపిన జర్నలిజం అంటే మెరుగు చంద్రమోహన్ ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు. పలువురు రాజకీయ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, సహచర జర్నలిస్టులు, సామాజిక వేత్తలు ఈ వేడుకలకు హాజరై కేకు కట్ చేయించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ మూడున్నర దశాబ్దాలుగా విలువలతో కూడిన జర్నలిజాన్ని కొనసాగిస్తూ యువ పాత్రికేయులకు మార్గ దర్శకుడిగా నిలిచిన వ్యక్తి చంద్రమోహన్ గారు. కష్టసుఖాల్లో సహచరులకు అండగా నిలిచే స్వభావం ఆయనది.

# ప్రజాస్వామ్యానికి నాల్గో స్తంభం జర్నలిజం ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్

- ప్రజల సమస్యలపై ధైర్యంగా నిలబడాలి మీడియాకు పిలుపు
- ఉప్పల్ అభివృద్ధిలో నిర్మాణాత్మక పాత్ర పోషించాలి
- ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీకి ఘన సన్మానం





**ఉప్పల్ ఫిబ్రవరి 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఉప్పల్ ప్రెస్ క్లబ్( ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా కమిటీ) సభ్యులు నూతన అధ్యక్షుడు వడ్డేపల్లి కిషోర్ ఆధ్వర్యంలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన కమిటీ సభ్యులను శాలువాలతో సన్మానించి, అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రజాస్వామ్యంలో జర్నలిజం నాల్గో స్తంభంగా నిలుస్తుంది. ప్రజలకు నిజమైన, నిష్పక్షపాత సమాచారం అందించడం మాత్రమే కాదు, సమాజంలో జరుగుతున్న అన్యాయాలను వెలుగులోకి తీసుకురావడం కూడా మీడియా బాధ్యత. జర్నలిస్టులు ఎలాంటి ఒత్తిడులకు లోనుకాకుండా ధైర్యంగా ప్రజల తరపున నిలబడాలి" అని పేర్కొన్నారు.అలాగే ప్రజల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని తెలిపారు. ఉప్పల్ ప్రాంత అభివృద్ధికి సంబంధించిన అంశాల్లో మీడియా ప్రతినిధులు నిర్మాణాత్మక సూచనలు చేయాలని కోరారు.ఉప్పల్ ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్ చేపట్టే సేవా కార్యక్రమాలకు తన పూర్తి మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమం క్లబ్ అధ్యక్షుడు మరియు సభ్యుల సమక్షంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రామంతపూర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు వంగాల సంతోష్ గుప్తా, మేడ్చల్ జిల్లా ఓబీసీ రేపు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# వికాస బాలల (అనాథ పిల్లల) జన్మదిన వేడుకలు







**హన్మకొండ,ఫిబ్రవరి14,(పిసిడబ్ల్యూ న్యూస్ ):** జన వికాస ఆధ్వర్యంలో హసన్ పర్తి సెంటర్లో శనివారం వికాస పిల్లల జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీనరసింహ హాస్పిటల్ డా..సంధ్యారాణి మాట్లాడుతూ పిల్లలు మంచిగా చదివి మంచి భవిష్యత్తులో ఎదగాలని వారికి సంబంధించిన ఎటువంటి సహాయ సహకారాలైన వారి ఉద్యోగ రీత్యా కూడా నా సహకారం ఉంటుందని పిల్లలకి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేశవాపూర్ వాస్తవ్యులు రామయ్య మాట్లాడుతూ చాలా సంవత్సరాల నుంచి బాల వికాస వ్యక్తిగా ఉంటూ ఈ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోష కరమైన విషయమని అదే విధంగా పిల్లలకి దాతగా ఉంటున్నందుకు నేను చేసే సహాయం చిన్నది బాల సహాయంతో పోలిస్తే మేము నేర్చుకోవాల్సిన విషయాలు చాలా ఉన్నాయని బాలిక సేవలను కొనియాడారు సూరారం సంపత్ రావు మాట్లాడుతూ పిల్లలను చూస్తూ ఉంటే గుండె తరుక్కుపోతుందని వాళ్లందరికీ మేమున్నామని హామీ ఇచ్చారు. ఈ కార్య క్రమంలో బాలవికాస సంస్థ ప్రతినిధులు జ్యోతి అమూల్య రమ హసన్ పర్తి సెంటర్ కో..ఆర్డినేటర్స్ రమ, శోభ, మహేశ్వరి, పద్మ, రూప, హసన్ పర్తి చుట్టు పక్కల గ్రామాల నూతన కార్యవర్గ సర్పంచులు అధిక సంఖ్యలో పాల్గొని వికాస పిల్లల జన్మదిన వేడుకలను వైభవంగా జరపడం జరిగింది.

# నారాయణగూడ జోన్ శ్రీ చైతన్యలో అంగరంగ వైభవంగా వికాసిత్ భారత్ వార్షిక దినోత్సవ వేడుకలు



**ముఖ్య అతిథిగా విచ్చేసిన టాలివుడ్ సినీ కొరియోగ్రాఫర్ యశ్వంత్ మరియు జోన్ ఏ.జి.యం. నూర్ మహమ్మద్ అలి**



**హైదరాబాద్ ఫిబ్రవరి 13(పిసిడబ్ల్యూ న్యూస్):** నారాయణగూడ జోన్ లో వార్షిక దినోత్సవ వేడుకలు ఉప్పల్ శిల్పారామం ఆడిటోరియంలో ఎంతో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టాలివుడ్ సినీ కొరియోగ్రాఫర్ యశ్వంత్ విచ్చేసి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు తమలోని దాగివున్న సృజనాత్మకతను వెలికితీస్తూ, జీవితంలో అన్ని రంగాల్లోను రాణించాలని, ఇలాంటి కార్యక్రమాల వలన విద్యార్థులు మానసిక ఒత్తిడిని తగ్గించుకొని, బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.తను కూడా చైతన్య విద్యార్థినేనని చెప్పారు. జోన్ ఏ.జి.యం. నూర్ మహమ్మద్ అలి మాట్లాడుతూ విద్యతో పాటు,నైతికవిలువలు, వినయ విధేయతలు అలవర్చుకునే విధంగా విద్యను బోధిస్తున్నామని, విద్యార్థుల్లో దాగివున్న కళానైపుణ్యాలను ఇలాంటి కార్యక్రమాల ద్వారానే వెలికి తీయవచ్చని అలానే అన్ని పోటీ పరీక్షల్లోను మొదటి శ్రేణిలో ఉన్నారని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మారుతున్నా విద్యార్థుల మనస్తత్వాలను జాగృతి పరిచే దిశగా సెలబ్రేషన్స్ నిర్వహించామని సభాముఖంగా తెలియజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు షీల్డ్స్ తో పాటు మెడల్స్, సర్టిఫికెట్స్ ను అందజేసి అభినందించారు, ఈ సందర్భంగా హబ్సిగూడ 2 శ్రీ చైతన్య ప్రధానోపాధ్యారాలు భాగ్యలక్ష్మి పాఠశాల వార్షిక నివేదికను చదివారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సాహ భరితంగా సాగి, విభిన్న కళలను ఆయా సన్నివేశాలలో ప్రదర్శించి చూపరుల ఆహుతులను హర్ష ద్వానాలను అందుకున్నారు.ఈ కార్యక్రమానికి జోన్ ఆర్.ఐ. వెంకట్, తార్నాక బ్రాంచ్ ప్రధానోపాధ్యాయురాలు ప్రశాంతి , బర్కత్ పురా బ్రాంచ్ ప్రధానోపాధ్యాయురాలు మాధవి, హిమయత్ నగర్ బ్రాంచ్ ప్రధానోపాధ్యాయురాలు శివాని, నాచారం బ్రాంచ్ ప్రధాన ఉపాధ్యాయులు షారూన్ జ్యోతి , వెంకట నర్సయ్య , నల్లకుంట జోన్ ప్రధానోపాధ్యాయుడు వెంకట రమణ , వైస్ ప్రిన్స్ పల్స్ శ్రీ కీర్తి , మాలతి, షాలిని, జోన్ కో ఆర్డినేటర్స్ పుల్లారావు , రవి , రాజేంద్ర ప్రసాద్ , సుధా, షాలెట్ , అన్నపూర్ణ , కిషోర్ , నారాయణగూడ జోన్ డీన్స్, ఇంచార్జులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# తక్కువ ఖర్చుతో పేదలకు వైద్యం ఆర్ఎంపిలకే సాధ్యం

- గ్రామీణ వైద్యుల సేవ అభినందనీయం
- గ్రామీణ వైద్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటా...
- కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు తుమ్మల యుగేందర్






**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తక్కువ ఖర్చుతో పేదలకు వైద్యం గ్రామీణ వైద్యులకే సాధ్యం అని, 24 గంటలు 365 రోజులు అందుబాటులో ఉండే గ్రామీణ వైద్యుల సేవ అభినందనీయమని, వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని కాంగ్రెస్ రాష్ట్ర యువ నాయకులు తుమ్మల యుగేందర్ అన్నారు. ఖమ్మం పట్టణంలోని మంచికంటి ఫంక్షన్ హాల్లో ఆర్ఎంపిడబ్యూఏ 10వ జిల్లా మహసభ జిల్లా అధ్యక్షుడు బొమ్మినేని కొండలరావు అధ్యక్షతన జరిగిన సభకి తుమ్మల యుగేందర్ ముఖ్యతిధిగా హాజరై మాట్లాడారు. తక్కువ ఖర్చుతో పేదలకు వైద్యం అందిస్తున్న గ్రామీణ వైద్యులపై దాడులు ఆపాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.**సామాజిక చైతన్యంపై అవగాహన ఉండాలి : స్పర్శ సామాజిక అధ్యయన వేదిక కె భాస్కర్** గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం (ఆర్ఎంపిడబ్యూఏ) జిల్లా 10వ మహసభకు స్పర్శ సామాజిక అధ్యయన వేదిక అధ్యక్షులు కాకి భాస్కర్ హాజరై మాట్లాడుతూ.. గ్రామీణ వైద్యులు వైద్యంతో పాటు సామాజిక చైతన్యంపై కూడా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఆర్ఎంపిలకు స్పర్శ సామాజిక అధ్యయన వేదిక ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు.**ఐక్యంగా పోరాడుదాం : పంగా మల్లేశం రాజమౌళి** ఆర్ఎంపి వ్యవస్థ రోడ్డున పడే పరిస్థితి నేడు దాపురించిందని, ఐక్యంగా పోరాడకపోతే భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందని గ్రామీణ వైద్యుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పంగా మల్లేశం, స్టీరింగ్ కమిటీ మెంబర్ మిట్టపల్లి రాజమౌళి లు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎన్ఎంసీ, టిజిఎంసీ లు కలిసి సంయుక్తంగా మనపై చేస్తున్న దాడులను అరికట్టాలంటే ముందు మనమంతా ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలని కోరారు. పరిమితికి మించి వైద్యం చేస్తున్నామనే సాకుతో మనపై వివిధ రూపాల్లో దాడులు జరుగుతున్నాయని గుర్తుచేశారు. అదేవిధంగా జిల్లా అధ్యక్షకార్యదర్శులు బొమ్మినేని కొండలరావు, బోయినపల్లి శ్రీనివాసరావులు మాట్లాడుతూ... మహసభని విజయవంతం చేసిన ఆర్ఎంపిడబ్యూఏ సభ్యులకు, మహసభకు ఆర్థిక సహకరం అందించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కె. క్రిష్ణమూర్తి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఐ. నారాయణరావు, కొంగర గోపి, బండి కొమరయ్య, జిల్లా కొశాధికారి హసన్, ఉపాధ్యక్షులు జెడి మూర్తి, షేక్ నాగుల్ మీరా, మురహరి, ఖాసీం, మాధవరెడ్డి, రహీం, వెంకటరమణ, అక్కినపల్లి నాగేశ్వరరావు, పుల్లారెడ్డి, గౌతమ్, బాలు, కిషోర్, భాస్కర్, క్రిష్ణమోహన్, రమేష్, కాంతారావు, కనకరావు, శ్రీరాములు, ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ బాధ్యులు పర్సగాని నాగేశ్వరరావు, దావా సత్యనారాయణ, ప్రచార కార్యదర్శి గండారపు రామారావు పాల్గొన్నారు.

# వడియా రాజుల సత్రంలో ఘనంగా అన్నదానం



**శ్రీశైలం ఫిబ్రవరి 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** దేశంలో అత్యంత మహా పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీశైలంలో రెండవ రోజు అఖిలభారత ఒడియ రాజుల నిత్య అన్నదాన సత్రంలో చైర్మన్ జరిపిటి రాములు , అధ్యక్షులు జే. సత్యనారాయణ రాజు మరియు సత్రం కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ఉదయం అల్పాహారం , మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజన అన్నదానం చేయడం జరుగుతున్నది. ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, ఒరిస్సా రాష్ట్రాల నుండి వచ్చిన శివ స్వాములకు, యాత్రికులకు సంతృప్తిగా భోజన వసతులు ఏర్పాటు చేయడం జరుగుతున్నది, శ్రీశ్రీశ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆశీస్సులతో సత్రంలో అన్నదాన కార్యక్రమలు ఘనంగా జరుగుతున్నాయి.భారతదేశ ఆధ్యాత్మికతపు క్యాలెండర్లో "అద్భుతమైన శివుని రేయి"గా చెప్పుకొనే మహాశివరాత్రి అత్యంత ముఖ్యమైన పండుగ.ప్రతీ చాంద్రమాన మాసం లోని 14వ రోజు లేదా అమావాస్యకు ముందు రోజుని శివరాత్రి అంటారు. పంచాంగ సంవత్సరంలో వచ్చే పన్నెండు శివరాత్రులలో ఫిబ్రవరి మార్చ్ లలో వచ్చేదానికి ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉంది. ఈ రాత్రి, భూమి ఉత్తర అర్ధగోళం ఎటువంటి స్థితిలో ఉంటుందంటే, మనిషిలోని శక్తి సహజంగానే ఉప్పొంగుతుంది. ఈ రోజున ప్రకృతి మనల్ని ఆధ్యాత్మిక శిఖరానికి నెడుతుంది. దీనిని ఉపయోగించుకోవడానికే, ఈ సంస్కృతిలో రాత్రంతా జరిపే ఈ పండుగను నెలకొల్పారు. మనం తెల్లవార్లూ జాగారం చేసి మన వెన్నెముకను నిటారుగా ఉంచడం ద్వారా ఇలా శక్తులు సహజంగా పైకి ఎగసి పడడానికి సహకరించవచ్చు. వడియా రాజుల సత్రంలో ఘనంగా ఇటువంటి కార్యక్రమాలు చేసినందుకు పలువురు శివ స్వాములు భక్తులు. యాత్రికులు, ప్రజలు, ప్రశంసిస్తున్నారు ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నవారికి మహాశివరాత్రి ఎంతో ప్రముఖమైనది. కుటుంబ పరిస్థితులలో ఉన్నవారికి, ప్రపంచంలో గాఢమైన ఆకాంక్ష ఉన్నవారికి కూడా మహాశివరాత్రి ఎంతో ఆవశ్యకం. కుటుంబ పరిస్థితులలో నివసించేవారు, మహాశివరాత్రిని శివుని పెళ్లిరోజుగా చూస్తారు. ప్రాపంచిక లక్ష్యాలతో ఉన్నవారు, ఈ రోజును శివుడు తన శత్రువులందరినీ జయించిన రోజుగా చూస్తారు. శ్రీశ్రీశ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆశీస్సులతో వడ్డే రాజుల అన్నదాన సత్రం కార్యక్రమాలు ఏర్పాటు చేయుచున్నది.

# భారత జవాన్లకు సలాం..


## సందేశ్ ఆతే హై.. సందేశపు లేఖలతో ఆత్మీయతను పంచుదాం..

## తెలుగు రాష్ట్రాల్లో పూర్తిస్థాయిలో ఆర్మీ వైద్యశాలలు, పాఠశాలలు నెలకొల్పాలి

## విద్యార్థులతో మాజీ మిసెస్ ఇండియా రన్నరప్ డాక్టర్ మహమ్మద్ ఫర్హా..











**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** భారత దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి భారత సరిహద్దుల్లో శత్రు దేశాలతో వీరోచిత పోరాటాలు చేస్తూ మనమంతా హాయిగా నిద్రించేలా కృషిచేస్తున్న భారత జవాన్లకు సందేశం ఆతే హై అనే నినాదంతో భారతదేశ వ్యాప్తంగా గల పాఠశాలల విద్యార్థులు తమ చేతి రాతలతో లేఖలను రాసి వారిలో ఆత్మీయతను పంచుతూ.. భారత జవాన్లకు అభివందనం చేద్దామని మాజీ మిస్సెస్ ఇండియా రన్నరప్, హైకోర్టు న్యాయవాది, డాక్టర్ మహమ్మద్ ఫర్హా అన్నారు. ఖమ్మంలో పలు ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో భారత సైనికుల వీరోచిత పోరాటాలు, వారి త్యాగాలను విద్యార్థులకు అర్థమయ్యే విధంగా అవేర్నెస్ చేస్తూ లేఖలను స్వయంగా రాసి భారత జవాన్లకు తమ సలాం అంటూ... ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆమె తెలిపారు.. సందేశ్ ఆతే హై.. అనే సందేశపు లేఖలతో వారిలో ఆత్మీయత, మానసిక స్థైర్యాన్ని నిపుదాం అని ఆమె పిలుపునిచ్చారు. మన భారత జవానులు సరిహద్దులో మనదేశ రక్షణకోసం తమశక్తిని వొడ్డి మానసిక సంఘర్షణ, అనేక ఒత్తిడిలతో నిరంతర అనేక సవాళ్లను ఎదుర్కొంటూ.. మన భారత సైనికులు తమ ప్రాణాలను పణంగా పెట్టి మన దేశాన్ని కాపాడు తున్నారని ఆమె అన్నారు. సరిహద్దు భద్రత అంశంలో జమ్మూ కాశ్మీర్ నుండి ఈశాన్య రాష్ట్రాల వరకు దేశ సరిహద్దులను శత్రువుల చొరబాట్ల నుండి కాపాడుతూ.. తీవ్రవాద వ్యతిరేక చర్యలపై కూడా ఉక్కుపాదం మోపుతూ.., ఉగ్రవాద కార్యకలాపాలను అణచివేయడంలో మన భారత సైనికుల పాత్ర అనిర్వచనీయమని ఆమె అన్నారు. విపత్తు నిర్వహణ వరదలు, భూకంపాలు, కొండచరియలు విరిగిపడటం వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో కూడా ప్రజలను రక్షించడం. శాంతి పరిరక్షణ, దేశ సరిహద్దుల్లో శాంతి భద్రతను నెలకొల్పడం, సహాయక చర్యలు, మారుమూల ప్రాంతాల్లో వైద్యం, రవాణా సౌకర్యాలు కల్పించడం. సైనికుల పాత్ర అభినందనీయం అని అన్నారు. సియాచిన్ వంటి అత్యంత శీతల ప్రాంతాలు, రాజస్థాన్ ఎడారిలో తీవ్ర ఉష్ణంలో విధులు నిర్వహించడం హర్షణీయమన్నారు. సుదీర్ఘకాలం తమ కుటుంబానికి దూరంగా ఉంటూ.. మనదేశాన్ని కాపాడుతున్న రియల్ హీరోలు వీరే అని ఆమె కితాబునిచ్చారు. మన భారత సైనికులు ఎదుర్కొనే సవాళ్లకు మన మంతా సెల్యూట్ సలాం పేరుతో సందేశ్ పంపుదామని ఆమె అన్నారు. సైనికులు పర్యావరణ అనుకూలత, ఒంటరితనం, బెదిరింపులు వంటి వివిధ సవాళ్లను ఎదుర్కొంటారని, వారి విధుల్లో దృష్టి కేంద్రీకరించి, స్థితిస్థాపకంగా ప్రభావవంత... సైనికుడిగా ఉండటం అంటే ఏమిటి తరచుగా స్టేషన్ మార్పులు, సుదీర్ఘకాలం కుటుంబాలకు, పర్వదినోత్సవాలకు దూరంగా ఉంటూ.. మన దేశ రక్షణకోసం, మన భవిష్యత్ కు తమ నిద్రహారాలు మానుకుని మనమశీతా మన నివాసాలలో గల ఫ్యాన్లు, కూలర్లు, ఏసిలలో హాయిగా శయనంను పొందుతున్నామని ఆమె అన్నారు. భారత జవాన్లకు తాత్కాలిక మానసిక ఉపశమనమును కలిగించేందుకు 'సందేశ్ ఆతే హై' అనే నిర్వచనంతో భారత సరిహద్దులో మన దేశ రక్షణకోసం పహారా కాస్తున్న భారత జవాన్లకు మన లేఖలు వారిలో ఆత్మీయ స్థైర్యాన్ని నింపేవిధంగా దోహదపడతాయని ఆమె అన్నారు. మన భారత సైనికులు పర్యావరణాన్ని బట్టి అనేక ఇబ్బందులను ఎదుర్కోశీటూ మనకోసం, మన భావితరాల కోసం వారి త్యాగాలు, వారి అకుంఠిత దీక్ష, పట్టుదల, విధి నిర్వహణలో విరామమెరుగని భారత యోధుల ధైర్య సాహసాలను నేటి విద్యార్థులు సామాజిక మాధ్యమాలు, పాఠ్యాంశాల ద్వారా గ్రైకొని వాటిలో స్ఫూర్తిని నింపాలని ఆమె కోరారు. వారు అనేక అసాధారణ సవాళ్లు, శారీరక ప్రమాదాలను ఎదుర్కొంటూ... తరచుగా యుద్ధశీలో భారత దేశ రక్షణకోసమే విధులు నిర్వహిస్తున్నారని ఆమె అన్నారు. కేంద్ర ప్రభుత్వం వారి జీత భత్యాలు 25శాతం పెంచాలని ఆమె కేంద్రప్రభుత్వాన్ని కోరారు. అన్ని జిల్లాలో పూర్తిస్థాయిలలో ఆర్మీ వైద్య శాఖలు, ఆర్మీ ప్రభుత్వ పాఠశాలలను ప్రత్యేకంగా నెలకొల్పి ఆర్మీ ప్రత్యేక దినోత్సవాలలో భారత దేశ వ్యాప్తంగా వర్చువల్ గా ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

# లాయర్ స్వప్న కేసులో నిందితుల అరెస్ట్

## హత్యకు ఉప యోగించిన కార్లు, ఫోన్లు స్వాధీనం

## భూ వివాదం నేపథ్యంలోనే హత్య జరిగినట్లు పోలీసుల వెల్లడి



**రంగారెడ్డి,ఫిబ్రవరి14:** మొయినాబాద్ కేతిరెడ్డిపల్లిలో న్యాయవాది స్వప్న హత్య కేసులో పోలీసులు కీలక విషయాలు వెల్లడించారు. చేవెళ్ల కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న అడ్వకేట్ గోటికె స్వప్న ఫిబ్రవరి 4న రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ సమీపంలో దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ కేసులో నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు శనివారం మీడియా ముందు ప్రవేశపె ట్టారు. న్యాయవాది స్వప్న హత్యకు భూ వివాదమే కారణమని నిర్ధారించారు. హత్యకు పాల్పడిన నలుగురు నిందితులలో ప్రధాన నిందితుడు స్వప్న సొంత అన్న గోటికె రాజు మరో ముగ్గురు సహచరులతో కలిసి హత్యకు కుట్ర చేసినట్లు ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ డీసీపీ యోగేష్ గౌతమ్ చెప్పారు. సర్వే నంబర్ 339లోని 4 ఎకరాల భూమిపై వివాదం. భూమి సర్వే కోసం వెళ్లిన సమయంలో నిందితులు స్వప్నపై దాడికి పాల్పడ్డారు. మొదటగా కారుతో ఢీకొట్టి, తర్వాత రాళ్లు,కర్రలతో దాడి చేసి అనంతరం కత్తితో గొంతు కోసి హత్య చేశారు. దీంతో ఘటన స్థలంలోనే స్వప్న మృతి చెందింది. హత్య అనంతరం ఇన్నోవా కార్, స్కూటీలో నిందితులు పరారయ్యారు. ఇన్నోవా కారు, స్కూటీ సీజ్ చేశారు. నలుగురు నిందితుల మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. హత్యకు ఉపయోగించిన కొడవలిని కూడా సీజ్ చేశాం అని డీసీపీ యోగేష్ తెలిపారు.చెల్లిని చంపిన సొంత అన్న కేసులో మరో వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇప్పటికే స్వప్న అన్న రాజుతో పాటు ఇద్దరి పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. స్వప్న లొకేషన్ వివరాలు ఎప్పటికప్పుడు రాజుకు చేరవేసిన శేఖర్ అనే మరో వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. గతంలోనూ రెండు సార్లు స్వప్నను హత్య చేసేందుకు ప్రయత్నించినట్టు రాజు విచారణలో ఒప్పుకున్నాడు. ఒకసారి కారుతో మరోసారి బుల్డోజర్‌తో స్వప్నను ఢీ కొట్టించే ప్రయత్నం చేశాడు రాజు. హత్య చేసి రోడ్డు ప్రమాదంగా మలిచేందుకు ప్లాన్ చేశాడు. రెండు ఘటనల నుంచి స్వప్న తప్పించుకుంది. సీసీ కెమెరాలు లేని ప్రదేశాలు చూసి స్వప్నను వెనుక నుంచి ఢీ కొట్టేం దుకు రాజు ప్లాన్ చేశాడు. ప్లాన్ సక్సెస్ చేసేందుకు తన స్నేహితులు వీరేష్, శివ, శేఖర్ సహాయం తీసుకున్నాడు. ఈ రోడ్డు ప్రమాదం కేసులను హత్యాయత్నం కేసులుగా పోలీసులు మార్చనున్నారు.

# ప్రదోష కాలమే పరమశివుడికి ప్రీతికరం

- ఆ సమయంలోనే పూజలు చేస్తే మంచిది



**వేములవాడ,ఫిబ్రవరి14:**తిథులలో త్రయోదశి, చతుర్దశి చాలా ప్రత్యేకమైనవి. శివరాత్రికి సంబంధించినంత వరకు 'ప్రదోష' కాలం చాలా ముఖ్యం. అంటే రాత్రి కాలం అని అర్థం. రాత్రి వేళ ప్రదోషంతో ప్రారంభమవుతుంది. అంటే... సాయంత్రం ఆరు నుంచి ఏడు గంటల మధ్య సమయం అన్నమాట. ఈ సమయంలో పరమేశ్వరుడిని పూజించినా, శివ పంచాక్షరీ ధ్యానం చేసినా మానసిక ప్రశాంతత లభిస్తుంది. విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి పెరుగుతుంది. ఇక, త్రయోదశికి మన్మథుడు, చతుర్దశికి కలి పురుషుడు అధిపతులు. వీరిరువురినీ నియంత్రించే శక్తి ఒక్క పరమేశ్వరుడికే ఉంది. అలాగే బుధ, గురువారాలు బుద్ధికీ, మాటకీ సంకేతం గనక... రోజూ కాకపోయినా ఈ రోజుల్లో, ఆ తిథుల్లో ప్రదోషకాలంలో శివారాధన చేయాలని చెబుతారు. 'ఓం నమః శివాయ' అని స్మరిస్తే చాలు కరిగిపోతాడు పరమశివుడు. భక్తితో ఓ సుమం సమర్పించినా సంతుష్టుడవుతారు. ఇక స్వామికెంతో ప్రీతి కరమైన ప్రదోష కాలంలో పూజిస్తే విశేష ఫలితాలు ఉంటాయి. ప్రదోషమంటే పాప నిర్మూలన. తెలిసీ తెలీక చేసే పాపకర్మల వల్ల ప్రతిబంధకాలను కొని తెచ్చుకున్నట్లవుతుంది. దాంతో పురోభివృద్ధికి ఉన్న అవకాశాలు పరిమితమౌతాయి. ఆ పాపకర్మలు నిర్జీవం కావాలంటే, దానికి తగ్గ పుణ్యకర్మలు చేయాలి. పరమశివుడు ప్రమథ గణాలతో కొలువయ్యుండే ప్రదోషకాలంలో శివుని స్మరిస్తే మన పాప కర్మల ఫలాన్ని తాను స్వీకరించి కష్టాలను తొలగిస్తాడనేది భక్తుల నమ్మకం. అందుకే ఉపవాసంత తరావత ప్రదోష కాలంలో అభిషేకాలు చేయాలి.

# శివరాత్రి రుద్రుడికి ప్రీతకరం

## ఉపవాసంతో స్వామికి అర్చన మంచిది



**ద్రాక్షారామం,ఫిబ్రవరి14:**శివుడికి ఎంతో ప్రీతికరమైన రోజు మహా శివరాత్రి. హిందువులు పెద్ద పండుగల్లో శివరాత్రి ఒకటి. పార్వతీదేవిని శివుడు పెళ్లాడిన రోజునే ఈ పండుగగా జరుపుకుంటారు. అలాగే శివపురాణంలో మహాశివరాత్రికి సంబంధించి ఇంకొన్ని కథలు కూడా ఉన్నాయి. మాఘమాసంలోని కృష్ణ పక్ష చతుర్దశి రోజున మహా శివరాత్రి వస్తుంది. ఈ రోజున శివుడిని భక్తి, పూజలతో కొలిస్తే అంతా మంచి జరుగుతుందని నమ్ముతారు. ఈ ఏడాది అలాంటి పవిత్రమైన రోజు ఫిబ్రవరి 15న వచ్చింది. దేశమంతటా శివాలయాల్లో పెద్ద ఎత్తున శివరాత్రి సంబరాలు జరుగుతుంటాయి. శివరాత్రి అనగానే అందరికీ వెంటనే గుర్తొచ్చేది. ఉపవాసం, జాగరణ. ఈ రోజున ఉపవాసం ఉండి, రాత్రి జాగరణ చేస్తే పుణ్యం దక్కుతుందని భక్తులు ప్రగాఢంగా నమ్ముతారు. శివరాత్రి నాడు తెల్లవారుజామునే లేచి, స్నానం చేసి ఆ తర్వాత శివరాత్రి వ్రతాన్ని మొదలుపెట్టాలి. ఈ వ్రతం చేసేటప్పుడు ఉపవాసం, జాగరణం, బ్రహ్మచర్యం అనే నియమాలు పాటించాలి. ఇంట్లోనే గానీ, ఆలయంలోగానీ వ్రతాన్ని ఆచరించవచ్చు. రాత్రంతా జాగరణం ఉండి, ఉదయాన్నే స్నానం చేశాక మళ్లీ పూజ చేసి వ్రతాన్ని విడవాలి. అన్నం లాంటి రోజూ తీసుకునే ప్రధాన ఆహారం కాకుండా పాలు, పండ్లు మాత్రమే, అదీ సాయంత్రం పూటనే తీసుకోవాలి. ఇతరులతో దైవ సంబంధమైన మాటలనే ఎక్కువగా మాట్లాడితే మంచిది. ఓం నమః శివాయ మంత్రాన్ని జపిస్తూ ఉండాలి.అనారోగ్యంతో ఉన్నప్పుడు ఉపవాసం ఉండకండి.మహా శివరాత్రి నాడు భక్తులు ఉపవాస దీక్షను పాటిస్తారు. చాలామంది కఠినంగా ఉండి.. కనీసం నీరు కూడా తాగరు. దీనిని నిర్జల ఉపవాసం అంటారు. కొంతమంది పాలు పండ్లు లాంటి సాత్విక ఆహారం తీసుకుంటారు. ప్రస్తుతం జీవన ప్రమాణాల దృష్ట్యా పెరుగు, మజ్జిగ, కొబ్బరి నీరు డ్రై ఫ్రూట్స్ వంటివి కూడా తినవచ్చు. శివరాత్రి మరుసటి రోజు సూర్యోదయం అయిన తరువాత ఉపవాస దీక్షను విరమించాలి. మహాశివరాత్రి ఉపవాస సమయంలో కొన్ని ఆహారాలను ఖచ్చితంగా తినకూడదు. వీటిలో గోధుమలు, బియ్యం, పప్పులు మరియు పప్పుధాన్యాలు వంటి ధాన్యాలు ఉన్నాయి. ఉల్లిపాయలు, వెల్లుల్లి , ఉడికిన పదార్థాలను తినకూడదు. ఇంకా వీటితో పాటుగా మద్యం, పొగాకు వంటి వాటికి దూరంగా ఉండాలని పండితులు చెబుతున్నారు. శివరాత్రికి చేసే జాగరణ మనలో ఉన్న శివత్వాన్ని జాగృతం చేస్తుంది. జాగరణం మనలో ఉన్న శివుడిని జాగృతం చేస్తుంది, తమస్సును తొలగిస్తుంది. సినిమాలు చూస్తునో, పిచ్చి కబుర్లు చెప్పుకుంటూనో, కాలక్షేపం చేస్తూనో చేసే జాగరణకు అది జాగరణ అవ్వదు, కాలక్షేపం మాత్రమే అవుతుంది. అప్పుడు పుణ్యం రాకపోగా, ఆ సమయంలో మట్లాడిన చెడు మాటల వలన పాపం వస్తుంది. శివరాత్రి మరునాడు ఉదయం శివాలయాన్నిసందర్శించి, ప్రసాదం తీసుకుని, ఇంటికి వచ్చి భోజనం చేసి ఉపవాస వ్రతం ముగించాలి.

# అట్లీ-అల్లు అర్జున్ మూవీ

## సినిమా షూటింగ్ డిలేపై అల్లు అసహనం



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీ కుమార్ తో చేస్తున్న భారీ పాన్ ఇండియా సినిమా గురించి ఇండస్ట్రీలో ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. దాదాపు రూ.800 కోట్ల భారీ బడ్జెతో హాలీవుడ్ రేంజ్‌లో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. విజువల్ వండర్‌గా, హైఎండ్ గ్రాఫిక్స్‌తో ఈ సినిమాను తీర్చిదిద్దుతున్నట్లు సమాచారం. అందుకే ఈ సినిమాకు సంబంధించిన చిన్న న్యూస్ అయినా సోషల్ మీడియాలో క్షణాల్లో వైరల్ అవుతోంది. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం, ఈ సినిమా విడుదల తర్వాత ఇండియన్ సినిమా మేకింగ్ స్టైల్‌లో కొత్త ట్రెండ్ సెట్ అవుతుందని భావిస్తున్నారు. లార్జ్ స్కేల్ ప్రాజెక్ట్స్‌కు ఈ సినిమా ఫౌండేషన్‌గా మారే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా కొనసాగుతుందనే వార్తలు వినిపిస్తున్నప్పటికీ, తాజాగా ఈ ప్రాజెక్ట్‌పై మరో టాక్ ఇండస్ట్రీలో చక్కర్లు కొడుతోంది. అదేంటంటే? సినిమా షూటింగ్ అనుకున్న దానికంటే నెమ్మదిగా సాగుతుండటంతో అల్లు అర్జున్ అసంతృప్తిగా ఉన్నాడని గాసిప్స్ వినిపిస్తున్నాయి. ఎ÷-లాన్ చేసిన రిలీజ్ డేట్‌కు సినిమా పూర్తి అవుతుందా లేదా అన్న ఆందోళన కూడా బన్నీకి ఉన్నట్లు టాక్. ఈ నేపథ్యంలో మేకర్స్‌తో మాట్లాడి, మేకింగ్‌ను మరింత పక్కాగా ప్లాన్ చేసి షూటింగ్ వేగవంతం చేయాలని సూచించినట్టు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ న్యూస్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఇక ఈ సినిమా తర్వాత అల్లు అర్జున్ మరో తమిళ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ తో కూడా సినిమా చేయనున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఆ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన రావడంతో ఫ్యాన్స్‌లో మరింత ఎగ్జైట్మెంట్ పెరిగింది. ఆ సినిమా కూడా భారీ పాన్ ఇండియా లెవల్‌లో తెరకెక్కనుందని టాక్ వినిపిస్తోంది. మొత్తంగా చూస్తే, అట్లీ – అల్లు అర్జున్ కాంబినేషన్ మూవీ 2027లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఈ రెండు ప్రాజెక్ట్స్ పూర్తయ్యే సరికి అల్లు అర్జున్ రేంజ్ గ్లోబల్ లెవల్‌కు వెళ్లే అవకాశం ఉందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఫ్యాన్స్ మాత్రం ఈ భారీ సినిమాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# రూమర్స్‌పై చమత్కరించిన మృణాళ్ ఠాకూర్



## ఏప్రిల్ 1న పెళ్లి నిజమే

సినీ ఇండస్ట్రీలో రూమర్స్ అనేవి కొత్త విషయం కాదు. ఇద్దరు నటీనటులు కలిసి ఒక ఈవెంట్‌లో కనిపించినా, సోషల్ మీడియాలో వారిద్దరి మధ్య ఏదో సంబంధం ఉందనే వార్తలు చక్కర్లు కొడుతుంటాయి. ఇదే పరిస్థితి ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ మరియు బాలీవుడ్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ విషయంలో కూడా కనిపిస్తోంది. గత కొద్ది రోజులుగా వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారన్న ప్రచారం సోషల్ మీడియా నుంచి మెయిన్ స్ట్రీమ్ మీడియా వరకూ హాట్ టాపిక్‌గా మారింది. ఈ రూమర్స్‌కు అసలు కారణం ఒక పార్టీ. ఓ ప్రైవేట్ ఈవెంట్‌లో ధనుష్, మృణాల్ ఇద్దరూ కలిసి కనిపించడంతో మొదట సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. దానికి తోడు మృణాల్ నటించిన ఓ సినిమా ఈవెంట్‌కు ధనుష్ హాజరుకావడం ఈ అనుమానాలకు మరింత బలం చేకూర్చింది. అప్పటి నుంచి వీరిద్దరూ రిలేషన్‌లో ఉన్నారని, త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారనే వార్తలు వరుసగా వినిపించాయి. మృణాల్ గతంలో 'మేము కేవలం మంచి స్నేహితులమే' అని చెప్పినా కూడా ఈ ప్రచారానికి బ్రేక్ పడలేదు. కొందరు అయితే మరో అడుగు ముందుకేసి వాలెంటైన్స్ డే రోజున అంటే ఫిబ్రవరి 14న వీరిద్దరూ పెళ్లి చేసుకోబోతున్నారని కథనాలు సృష్టించారు. ఇటీవల తన హిందీ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న మృణాల్ ఠాకూర్‌ను ఈ విషయంపై ప్రశ్నించారు. ఫిబ్రవరి 14న ధనుష్‌తో పెళ్లి చేసుకుంటున్నారా?' అని అడగగా మృణాల్ నవ్వుతూ వ్యంగ్యంగా సమాధానం ఇచ్చింది. ఫిబ్రవరి 14 కాదు ఏప్రిల్ 1న చేసుకుంటానేమో. ఎందుకంటే అది ఏప్రిల్ ఫూల్స్ డే కదా!' అంటూ చమత్కరించింది. ఈ వ్యాఖ్య సోషల్ మీడియాలో వెంటనే వైరల్ అయింది. అదే ఇంటర్వ్యూలో మృణాల్ మాట్లాడుతూ, 'ఈ రూమర్స్ ఎక్కడి నుంచి వచ్చాయో కూడా నాకు తెలియదు. కొందరు 'మృణాల్ పెళ్లి అధికారికంగా ఖరారు అయింది' అంటూ ప్రచారం చేస్తున్నారు. ఇది నిజంగా భయంకరంగా ఉంది' అని చెప్పింది. ఇలా క్లియర్ క్లారిటీ ద్వారా ధనుష్‌తో పెళ్లి వార్తలకు మృణాల్ పూర్తిగా చెక్ పెట్టినట్టే అయ్యింది.



# మెగాస్టార్ మూవీ.. అనస్వరకు లక్కీ ఛాన్స్!

వరుస ఫ్లాపులతో సతమతమైన మెగాస్టార్ చిరంజీవి ఈ సంక్రాంతికి బ్లాక్ బస్టర్ హిట్‌ని సొంతం చేసుకుని మళ్లీ ట్రాక్‌లోకి వచ్చేసిన విషయం తెలిసిందే. ఆయన కథానాయకుడిగా హిట్ మెషీన్ అనిల్ రావిపూడి డైరెక్షన్‌లో తెరకెక్కిన ఫ్యామిలీ యాక్షన్ డ్రామా -మన శంకరవరప్రసాద్ గారు-. లేడీ సూపర్ స్టార్ నయనతార హీరోయిన్‌గా నటించిన ఈ మూవీ జనవరి 12న సంక్రాంతి బరిలో నిలిచిన ఫస్ట్ డే ఫస్ట్ షో నుంచే బ్లాక్ బస్టర్ హిట్ టాక్‌ని సొంతం చేసుకుని ఫ్యామిలీ ఆడియన్స్‌తో పాటు మెగా ఫ్యాన్స్‌ని సమ్మోహన పరిచింది.సంక్రాంతి బరిలో ఎన్ని సినిమాలు పోటీపడినా వాటన్నింటినీ వెనక్కి నెట్టి సంక్రాంతి విన్నర్‌గా నిలిచింది. చిరు కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లని రాబట్టి ట్రేడ్ వర్గాలని ఔరా అనిపించింది. ఫస్ట్ షో నుంచే మంచి టాక్‌ని సొంతం చేసుకున్న ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద వరల్డ్ వైడ్‌గా రూ.300 కోట్లు రాబట్టి ఈ స్థాయిలో ఈ ఏడాది ప్రారంభంలో అత్యధిక వసూళ్లని రాబట్టిన తొలి రీజనల్ మూవీగా నిలిచింది. అంతే కాకుండా మెగాస్టార్‌లో సరికొత్త ఉత్సాహాన్ని అందించింది.

ఇదిలా ఉంటే ఈ మూవీ తరువాత మెగాస్టార్ నటించిన -విశ్వంభర- రిలీజ్‌కు రెడీ అవుతోంది. త్వరలోనే దీని రిలీజ్ డేట్‌ని మేకర్స్ అధికారికంగా ప్రకటించబోతున్నారు. ఈ సినిమా రిలీజ్‌కు సిద్ధమవుతున్న నేపథ్యంలో చిరు మరో క్రేజీ మాస్ మసాలా యాక్షన్ సినిమాకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. డైరెక్టర్ బాబి కొల్లి డైరెక్షన్‌లో మెగాస్టార్ చిరంజీవి ఓ భారీ యాక్షన్ డ్రామా చేయబోతున్నారు. దీన్ని దళపతి విజయ్‌తో -జన నాయగన్-, యష్‌తో -టాక్సిక్- మూవీలని నిర్మిస్తున్న కె.వి.ఎన్ ప్రొడక్షన్స్ అధినేత వెంకట్ కె. నారాయన నిర్మించబోతున్నారు.దీనికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ చాలా రోజులుగా జరుగుతోంది. -జన నాయగన్- చుట్టూ సెన్సార్ ఇబ్బందులు తలెత్తడంతో ఈ ప్రాజెక్ట్ ఆలస్యం అవుతూ వస్తోంది. ఇటీవల సెన్సార్ వివాదం ఫైనల్‌కు చేరడంతో నిర్మాత చిరు సినిమాపై దృష్టి పెట్టినట్టుగా తెలిసింది. ఈ మూవీని తండ్రీ కూతుళ్ల అనుబంధం నేపథ్యంలో పవర్ ఫుల్ స్టోరీగా తెరపైకి తీసుకొస్తున్నారు. ఇందు కోసం చిరుకు కూతురుగా ఎవరైతే బాగుంటుందని ఇప్పటికే కొంత మంది యంగ్ క్రేజీ హీరోయిన్‌ల పేర్లను పరిశీలించిన టీమ్ ఫైనల్‌గా -రేఖా చిత్రం-, ఛాంపియన్, విత్ లవ్ చిత్రాల ఫేమ్ అనస్వర రాజన్‌ని ఫైనల్ చేసినట్లుగా ఇన్ సైడ్ టాక్.

# ఘట్టమనేని మరో వారసుడు జయకృష్ణ ఎంట్రీ

## శ్రీనివాస మంగాపురం మూవీ పోస్టర్ విడుదల

వాలంటైన్స్ డే సందర్భంగా తెలుగు సినీ ప్రియులకు ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చింది. సూపర్ స్టార్ కృష్ణ మనవడు, రమేష్ బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ మరియు టైటిల్ పోస్టర్‌ను చిత్ర బృందం నేడు విడుదల చేసింది. విడుదలైన పోస్టర్‌లో 'ఏ భాషలో చెప్పాలి నా ప్రేమని, వెయ్యేళ్ళ నా ఈ ఎడబాటుని' అంటూ కథానాయకుడు శ్రీను మంగతో చెప్పిన డైలాగ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఘట్టమనేని కుటుంబం నుంచి మరో వారసుడు ఈ సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుపెడుతుండడంతో మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. బాలీవుడ్ సీనియర్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని ఈ చిత్రంతో హీరోయిన్‌గా తెలుగు ప్రేక్షకులకు పరిచయం కాబోతుంది. ఇక ఈ సినిమాకు ఆర్ ఎక్స్ 100, మంగళవారం చిత్రాల దర్శకుడు అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తున్నాడు. వైజయంతీ మూవీస్, స్వప్న సినిమా మరియు ఆనంది ఆర్ట్స్ క్రియేషన్స్ వంటి ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.




# రోషన్ హీరోగా ఏమో ఏమో ఇది మూవీ

ఛాంపియన్ హీరో రోషన్ మేక టాలెంటెడ్ డైరెక్టర్ శైలేష్ కొలను కాంబినేషన్‌లో రూపొందుతున్న సరికొత్త చిత్రానికి 'ఏమో ఏమో ఇది' అనే క్లాసిక్ టైటిల్‌ను ఖరారు చేశారు మేకర్స్. వాలెంటైన్స్ డే సందర్భంగా శనివారం ఈ సినిమా టైటిల్‌తో పాటు 'ద ఫస్ట్ బ్రీజ్' పేరుతో ఒక చిన్న గ్లింప్స్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఇప్పటివరకు 'హిట్' సిరీస్, 'సైంధవ్' వంటి ఇంటెన్స్ క్రైమ్ థ్రిల్లర్లతో మెప్పించిన శైలేష్ కొలను, ఈసారి పూర్తి భిన్నంగా రొమాంటిక్ కామెడీ జానర్‌ను ఎంచుకోవడం విశేషం. ఈ గ్లింప్స్‌లో హీరో రోషన్ (అభయ్) తన తల్లితో అమ్మాయిల గురించి, నేటి తరం రిలేషన్ షిప్స్ గురించి చేసే కామెడీ సంభాషణలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ సినిమాలో రోషన్ సరసన 'కన్నప్ప' ఫేమ్ ప్రీతి ముకుందన్ (అపూర్వ పాత్రలో) కథానాయికగా నటిస్తోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'ఖుషి', 'హాయ్ నాన్న' వంటి చిత్రాలకు అద్భుతమైన మ్యూజిక్ అందించిన హేషామ్ అబ్దుల్ వహాబ్ ఈ సినిమాకు సంగీతం సమకూరుస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని 2026 దసరా కానుకగా థియేటర్లలోకి తీసుకురావాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు.




# ఫ్రీగా సినిమా చూస్తూ.. అదే సినిమాను చంపేస్తున్నారు

టాలీవుడ్ లో అద్భుతమైన చిత్రాలను తెరకెక్కించి, ప్రేక్షకుల మదిలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న కొద్ది మంది దర్శకుల్లో కృష్ణవంశీ ఒకరు. ఆయన తెరకెక్కించిన ఎన్నో సినిమాలు ఘన విజయాలను సాధించాయి. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియెన్స్ ని ఆయన చిత్రాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇటీవలి కాలంలో కృష్ణవంశీ జోరు తగ్గింది. మరోవైపు, ఏదైనా సినిమా విడుదల అయిన వెంటనే... రివ్యూలు వెల్లువెత్తుతున్నాయి. వాటిలో కొన్ని నెగెటివ్ రివ్యూలు కూడా ఉంటున్నాయి. ఇలాంటి రివ్యూలు ఇచ్చే వారిపై కృష్ణవంశీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సినిమా థియేటర్లోకి వచ్చిన వెంటనే సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేస్తుంటారని... ఇలాంటి వారిలో 90 శాతం మంది మూర్ఖులేనని కృష్ణవంశీ అన్నారు. టికెట్ కూడా కొనకుండా వీళ్లు ఫ్రీగా సినిమాలు చూస్తారని... వెంటనే రివ్యూలతో ప్రేక్షకులను భయపెట్టేస్తారని విమర్శించారు. వారం రోజులు ఆగితే ప్రేక్షకులు సినిమా చూస్తారని... ఈలోగానే ఆడియన్స్ ను వీళ్లు భయపెడతారని మండిపడ్డారు. సినిమా లేకపోతే మీ బతుకే లేదు... అదే సినిమాను ఎలా నాశనం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీకు సిగ్గు అనిపించడం లేదా? అని ప్రశ్నించారు. సినిమా కోసం ఎంతో మంది కష్టపడతారని... వాళ్ల కష్టాన్ని తక్కువ చేయొద్దని అన్నారు.

